

కబ్జా కుట్రలు!

విలువైన 40 సెంట్ల పాఠశాల స్థలంపై కన్ను

గతంలో కొనుగోలు చేసినట్టు దొంగ పత్రాలు సృష్టి

చిలకలపూడి ప్రధాన కూడలిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని ఆక్రమించేందుకు అక్రమార్కులు అనేక కుట్రలు పన్నుతున్నారు. గతంలో తాము కొనుగోలు చేసినట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించారు. అధికార, ప్రతిపక్ష నాయకులు ఏకమై అత్యంత విలువైన స్థలాన్ని కాజేసేందుకు తెరవెనుక మంత్రాంగం నడుపుతున్నారు. నెలన్నర క్రితం ఈ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించారు. స్థానికులు అభ్యంతరం చెప్పడంతో తాత్కాలికంగా నిలిపివేశారు. సొంతం చేసుకునేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. దొంగ డాక్యుమెంట్లు, ఇంటి పన్ను, విద్యుత్ కనెక్షన్ ఏర్పాటుతో అడుగులు ముందుకు వేస్తున్నారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకుంటామని స్థానికులు చెబుతున్నారు.

- వేరే వ్యక్తుల పేరుతో ఇటీవల ఇంటి పన్ను
- అధికారులను బెదిరించి తాజాగా విద్యుత్ కనెక్షన్
- మంత్రి రవీంద్ర దృష్టికి విషయం
- వెంటనే విద్యుత్ మీటరు తొలగింపు
- కోట్ల రూపాయల స్థలాన్ని కాపాడుకుంటామంటున్న స్థానికులు



చిలకలపూడి ప్రధాన సెంటరు వద్ద పాఠశాల స్థలంలో ఏర్పాటు చేసిన బడ్డీ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: చిలకలపూడి, సర్కారుతోటలో నివాసల మధ్య సర్వే నెంబరు 357/1, 360లలో ఉన్న ఇళ్ల స్థలాల మధ్య 40 సెంట్ల స్థలాన్ని పాఠశాల నిమిత్తం కేటాయించారు. 1975లో ఈ స్థలంలో ఏహెచ్ ఎయిడెడ్ పాఠశాలను ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలను నడిపిన వ్యక్తి, హెచ్ఎంగా పనిచేసిన ఆయన భార్య మరణించారు. వీరికి సంతానం లేకపోవడంతో వీరి మరణానంతరం పాఠశాల మూతపడింది. అప్పటి నుంచి ఈ పాఠశాలస్థలం ఖాళీగానే ఉంటోంది. ఇటీవల కొందరు ఈ స్థలం కొనుగోలు మిగతా 6లో..

ఆక్రమించిన స్థలాన్ని లీజుకు ఇచ్చేశారు!

పాఠశాల స్థలాన్ని ఆక్రమించిన వారు వ్యూహాత్మకంగా వ్యవహరించి తమ అనుచరుడికి లీజుకు ఇచ్చినట్లు పత్రాలు సృష్టించారు. పెద్ద బడ్డీని ఇటీవల ఇక్కడ ఏర్పాటు చేశారు. లీజుదారుడి పేరున విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేశారు. విద్యుత్‌శాఖ అధికారులు ఈ స్థలం వివాదంలో ఉండటంతో విద్యుత్ మీటరు ఇవ్వబోమని చెప్పారు. దీంతో అక్రమార్కులు ఓ పెద్ద మనిషిని విద్యుత్‌శాఖ కార్యాలయానికి తీసుకువెళ్లి అక్కడి అధికారులను బెదిరించినంత పనిచేశారు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు తమకెందుకు వచ్చిన తలనొప్పులని విద్యుత్ మీటరును బిగించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులు, పెద్దలు పాఠశాల స్థలం ఆక్రమణ, లీజుకు ఇచ్చినట్లుగా చూపి విద్యుత్ కనెక్షన్ కోసం అధికారులను బెదిరించడం తదితర విషయాలను మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకువెళ్లారు. రెండు రోజుల క్రితం ఇక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్ మీటరును తొలగించారు. దీంతో ఈ విషయం మరింత చర్చనీయాంశమైంది.

జోరుగా పేకాట!

పెడన పోలీస్ సర్కిల్ పరిధిలో నిర్వహణ

- మూడు జిల్లాల నుంచి వస్తున్న జూదరులు
- నాయకులు, పోలీసుల సమన్వయంతో గుట్టుగా రూ.కోట్లలో జూదం
- విందు, వినోదంతో ఆతిథ్యమిస్తున్న నిర్వాహకులు



పెడన పోలీస్ సర్కిల్ పరిధిలో పెద్ద ఎత్తున పేకాట శిబిరం నిర్వహిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కూటమి నాయకులు, పోలీసుల మధ్య సమన్వయంతో నడుస్తున్న శిబిరాలకు మూడు జిల్లాలకు చెందిన జూదరులు తరలివస్తున్నారని తెలిసింది. ఇక్కడ కోట్ల రూపాయల నగదు చేతులు మారుతోందని సమాచారం. ఆటగాళ్ల స్థాయిని బట్టి మందు, విందు, వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారని తెలిసింది.

(ఆంధ్రజ్యోతి, మచిలీపట్నం క్రైమ్): పెడన మండలం కాకర్లమూడి గ్రామంలో జోరుగా పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కూటమికి చెందిన ఒక మండల స్థాయి నాయకుడు కీలక పాత్ర పోషిస్తున్నట్టు సమాచారం. పేకాట ఆడటానికి వచ్చే బడాబాబుల కార్లను పెడనలో పార్కు చేయించి ద్విచక్రవాహనాల ద్వారా మిగతా 6లో..

పూజలు చేస్తున్న అర్చకులు



నేటి నుంచి పవిత్రోత్సవాలు

దుర్గగుడిలో ఏర్పాట్లు పూర్తి

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దుర్గా మల్లేశ్వర దేవస్థానంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు వార్షిక పవిత్రోత్సవాలు జరగనున్నాయి. తొలిరోజు దుర్గమ్మకు స్నపన కార్యక్రమం నిర్వహిస్తారు. వేకువజామున దర్శనం నిలిపివేస్తారు. అనంతరం వరలక్ష్మీదేవిగా అమ్మవారు దర్శనం ఇస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి మాత్రమే భక్తులకు దర్శనం కొనసాగుతుంది. 10వ తేదీ పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయి. కాగా, గురువారం వైదిక కమిటీ సభ్యులు, వేద పండితులు వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ శుభ సంకల్పం చేసి అంకురార్పణ చేశారు. పండుగ వేళల్లో భక్తుల రద్దీని పురస్కరించుకుని ప్రొటోకాల్ వీఐపీలు దేవస్థానం సూచనలు పాటిస్తూ సహకరించాలని ఈవో శీనానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.

అమ్మవారికి బంగారు ఆభరణాలు సమర్పణ



విజయవాడ బెంజిసర్కిల్ ప్రాంతంలోని ఆచార్య రంగానగర్‌కు చెందిన పోసాని బసవయ్య, మనోహరమ్మ దంపతుల కుమారుడు ప్రసాదరావు గురువారం దుర్గమ్మకు రూ.3,05,000 విలువైన బంగారు ముక్కుపుడక, బొట్టు, నత్తు తదితర ఆభరణాలు సమర్పించారు. ఈ ఆభరణాలు నవరత్నాలతో కలిపి 30 గ్రాముల బరువు ఉంటాయని దేవస్థానం అధికారులు తెలిపారు.

అక్రమ మైనింగ్ @ రూ. 156.81 కోట్లు

గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమార్కుల బరితెగింపు

వైసీపీ పాలనలో అక్రమార్కులు రెచ్చిపోయారు. ఒక్క విజయవాడ రూరల్ మండలంలోనే రూ.156.81 కోట్ల అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారు. కొండలు, గుట్టలను తవ్వేసి 29.81 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి,గ్రావెల్‌ను తరలించుకుపోయారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తుతో ఈ అక్రమాల వివరాలు బహిర్గతం అయ్యాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారులు మొక్కుబడిగా ఇచ్చిన నోటీసులు, అపరాధ రుసుం విలువే ఇంత ఉంటే.. దోచేసిన మొత్తం విలువ ఎంత ఉంటుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రూ.కోట్లలో అపరాధ రుసుం విధించినా ఇప్పటి వరకు నయాపైసా చెల్లించకపోవటం గమనార్హం.

- విజయవాడ రూరల్ మండలంలో కరిగిపోయిన కొండలు, గుట్టలు
- తవ్వుకుపోయిన గ్రావెల్/మట్టి పరిమాణం 29.81 లక్షల క్యూబిక్ మీటర్లు
- సమాచార హక్కు చట్టం దరఖాస్తుతో ఇన్నాళ్లకు వివరాలు బహిర్గతం
- స్థానికుల ఫిర్యాదుతో షోకాజ్, అపరాధ రుసుం నోటీసులతో సరిపెట్టిన అధికారులు
- మైనింగ్ శాఖకు నయాపైసా కట్టని అక్రమార్కులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ రూరల్ మండలంలో జరిగిన అక్రమ మైనింగ్ వ్యవహారాల బండారం ఇన్నాళ్లకు బయట పడింది. అప్పట్లో స్థానికుల ఫిర్యాదులపై మొక్కుబడి కేసులు నమోదు చేసిన మైనింగ్ శాఖ అధికారులు.. నాటి అరాచకాలను తాజాగా బహిర్గతం చేశారు. కొత్తూరు, తాడేపల్లి, పి.నైనవరం, వేమవరం, పాతపాడు, జక్కంపూడి గ్రామాలతో పాటు, జీ కొండూరు మండలం వెలగలేరు తదితర ప్రాంతాల్లో జరిపిన అక్రమాలన్నీ సమాచార హక్కు చట్టం దరఖాస్తు ద్వారా వెలుగులోకి వచ్చాయి. అప్పట్లో మైనింగ్ శాఖ అధికారుల కనుసన్నల్లోనే ఈ అక్రమ మైనింగ్ జరిగింది. చాలా వరకు చూసి చూడనట్లు వదిలేశారు. ప్రజల ఫిర్యాదులతో కేసుల లెక్కల కోసం.. గుర్తించిన అక్రమాలను చూస్తేనే కళ్లు తిరుగుతున్నాయి. ఇక పూర్తిస్థాయి అక్రమాలపై నిగ్గు తేల్చితే అంచనాలకు అందని పరిస్థితి. మైనింగ్ శాఖ విధించిన జరిమానాల ప్రకారం చూస్తే.. రూ.156.81 కోట్ల విలువ చేసే 29.81 లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్/మట్టి సంపదను అక్రమార్కులు తన్నుకుపోయారు. అప్పట్లో కేవలం షోకాజ్ నోటీసులతో మైనింగ్ శాఖ అధికారులు సరిపెట్టారు. ఆ తర్వాత అపరాధ రుసుం చెల్లించాలని డిమాండ్ నోటీసులు ఇచ్చి వదిలేశారు. గ్రావెల్, మట్టి తవ్వుకుపోయిన వారెవరూ కూడా ఇప్పటి వరకు నయా పైసా చెల్లించలేదు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు అడుగుతుంటే.. తమ లోపాలు బయట పడతాయేమోనన్న భయంతో జిల్లా మైనింగ్ శాఖ అధికారులు అక్రమార్కులపై రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) యాక్ట్ ప్రయోగిస్తామని చెబుతున్నారు.



విజయవాడ రూరల్ మండలంలో తవ్వకాలు(ఫైల్)

సమాచారం హక్కు చట్టం ద్వారా వెలుగులోకి..

సమాచార హక్కు చట్టం దరఖాస్తు మేరకు వెలుగు చూసిన అక్రమాలను చూస్తే విజయవాడ రూరల్ మండలంలో అడ్డగోలుగా జరిగిన అక్రమ తవ్వకాలు ఎంత భయంకరంగా ఉన్నాయో అర్థమవుతోంది.

- కొత్తూరు - తాడేపల్లి గ్రామంలో సర్వే నెంబర్లు 40/4, 5, 7, 8, 13, 14, 15, 18, 19, 20, 22, 23, 25, 26, 27, 28, 35 /ఎఫ్ఎఫ్‌జీ, 36/సీ, డీ, ఈ, ఎఫ్, జీ, జే, కే, ఐ, 39/9, 8, 114, 227/17, 41/,5, 6, 7, 256/3, 4, 260/10, 255/7, 260/4, 25,28, 28, 29, 34, 35, 16, 146/6, 2ఏ, 2బీ 2, 4, 5,6,7,8,10, 263/4, 263 / 5లలో రూ. 10.43 లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్/మట్టి తవ్వి రవాణా చేసినట్టుగా నిర్ధారణ అయింది. మొత్తం 33 మంది అక్రమార్కులకు షోకాజ్ నోటీసులు ఇవ్వటంతో పాటు రూ. 57.86 కోట్ల జరిమానాతో కూడిన డిమాండ్ నోటీసులను ఇచ్చింది.
- కొత్తూరు గ్రామ సర్వే నెంబర్ 34, 34/1లలో 3,90,116 క్యూబిక్ మీటర్ల మిగతా 6లో..

జోగి మెడకు బిగుస్తున్న ఉచ్చు!

ఆ భూములు అగ్రిగోల్డ్‌వే!

- రెవెన్యూ, ఏసీబీ ఉమ్మడి తనిఖీలో వెల్లడి
- తాజాగా సీఐడీకి సమగ్ర నివేదిక అందజేత
- హోమ్ డిపార్ట్‌మెంట్ అటాచ్‌లో ఉన్న భూములు అగ్రిగోల్డ్ వేనని నిర్ధారణ
- ఆ భూములనే రిజిస్ట్రేషన్ చేయించుకుని విక్రయానికి శ్రీకారం

అగ్రిగోల్డ్ భూముల కబ్జా, అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో మాజీ మంత్రి జోగి రమేశ్ మెడకు ఉచ్చు బిగుస్తుంది. తనయుడు, సోదరుడిని తెరపై పెట్టి రాష్ట్ర హోం డిపార్ట్‌మెంట్ ఆధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ భూములను చేజిక్కించుకోవటంతో పాటు వాటిని వేరే వారికి విక్రయించిన విషయం వాస్తవమని తేలింది. రెవెన్యూ, ఏసీబీ శాఖలు సంయుక్తంగా చేపట్టిన విచారణ కమిటీ నివేదిక తాజాగా సీఐడీకి చేరింది. రెవెన్యూ, ఏసీబీ సంయుక్తంగా క్షేత్ర స్థాయిలో జరిపిన పరిశీలనలో కొన్ని కీలక ఆధారాలను సేకరించారు. విజయవాడ రూరల్ తహసీల్దార్ సుగుణ తన విచారణకు సంబంధించిన సమగ్ర రిపోర్టును ఏసీబీకి, సీఐడీకి తాజాగా అందించారు. సంయుక్త విచారణ రిపోర్టు 'ఆంధ్రజ్యోతి' చేతికి చిక్కింది. జోగి రమేష్ తనయుడు, సోదరుడు పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుని, వేరేవారికి విక్రయించటం చెల్లుబాటు కాదని రెవెన్యూ, ఏసీబీ జాయింట్ కమిటీ తేల్చింది. ఆ భూములు ముమ్మాటికీ అగ్రిగోల్డ్‌వని తేల్చింది. పదకొండు పేజీలతో కూడిన సమగ్ర నివేదిక ఈ భూములకు సంబంధించిన వాస్తవాలు ఏమిటన్నది తహసీల్దార్ సుగుణ నివేదికలో వెల్లడించారు.

- (ఆంధ్రజ్యోతి, విజయవాడ)



నివేదికలో ఏముందంటే..

ఏసీబీ, రెవెన్యూ అధికారుల సంయుక్త పరిశీలనలో తేలిన అనేక అంశాలను నివేదికలో పొందుపరిచారు. అంబాపురం గ్రామం ఆర్ఎస్ నెంబర్ 87లోని 2293.05 చదరపు గజాల భూమిని పెదపాడు పోలీసు స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెంబర్ 3/2015 ప్రకారం జీవో ఎంఎస్ నెంబర్ 133, 117లను అనుసరించి రాష్ట్ర హోం డిపార్ట్‌మెంట్ అటాచ్ చేసిందని పేర్కొంది. ఈడీ జాయింట్ డైరెక్టర్ ప్రొవిజనల్ అటాచ్‌మెంట్ మిగతా 6లో..

ప్రణాళికాబద్ధంగా దసరా ఏర్పాట్లు

- పూజా కార్యక్రమాలు, రూ.500 టికెట్ల అమలుపై కమిటీ సమావేశంలో చర్చించాలి
- కమిషనర్ రామచంద్ర మోహన్

శాస్త్ర, సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల స్నాతకోత్సవంలో వెంకయ్యనాయుడు

స్వామినాథన్ సిఫార్సుల అమలుతోనే వ్యవసాయ రంగం మనుగడ

- స్వామినాథన్ శత జయంతి సభలో వక్తలు

6



సభలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ జీఎంవీ ప్రసాదరావు

స్వామినాథన్ సిఫార్సుల అమలుతోనే
వ్యవసాయ రంగం మనుగడ

» స్వామినాథన్ శత జయంతి సభలో వక్తలు

గవర్నర్‌పేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : స్వామినాథన్ సిఫార్సులను అమలు చేస్తేనే దేశంలో వ్యవసాయరంగం మనగలుగుతుందని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సీనియర్ సైంటిస్ట్ జీఎంవీ ప్రసాదరావు అన్నారు. హరిత విప్లవకారుడు స్వామినాథన్ శతజయంతి సభ జరుపుకోవడం మంచి పరిణామమన్నారు. ఏపీ రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతుల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో హరిత విప్లవ పితామహుడు, జాతీయ రైతు కమిషన్ చైర్మన్ డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ శతజయంతి సభ జరిగింది. రైతు సంఘం సీనియర్ నేత వై.కేశవరావు సభకు అధ్యక్షత వహించారు. ముందుగా స్వామినాథన్ చిత్రపటానికి మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ, స్వామినాథన్ చెప్పినట్టు సేంద్రీయ ఎరువులను తగ్గించి పచ్చి రొట్ట ఎరువులను పెంచి భూమిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా వ్యవసాయ రంగంలో మార్పులు అవసరమని, ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ, ప్రొఫెసర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు దేశంలో వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడమే కాకుండా రైతులను రక్షించుకోవడానికి ఆకలిలేని సమాజాన్ని నిర్మించడానికి ఉపయోగకరమన్నారు. ప్రభుత్వాలు స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. వ్యవసాయ విశ్రాంత శాస్త్రవేత్త ప్రొఫెసర్ వేణుగోపాలరావు మాట్లాడుతూ, స్వామినాథన్‌కు భారతరత్న అవార్డు ఇచ్చి సత్కరించిన ప్రభుత్వాలు ఆయన కమిటీ సిఫార్సులు అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. రైతు సంఘాలు ఒకే వేదికపైకి వచ్చి స్వామినాథన్ కమిటీ సిఫార్సులను ప్రభుత్వం అమలు చేసేలా ఒత్తిడి చేయాలని కోరారు. సభలో వివిధ సంఘాల నాయకులు పీవీ ఆంజనేయులు, పంచకర్ల రంగారావు, గౌరిశెట్టి నాగేశ్వరరావు, శివనాగేంద్ర, ఎం.నాగమల్లేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

పాఠశాలల్లో మెనూ పాటించాలి

» ఆహార కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయ ప్రతాప్‌రెడ్డి

మచిలీపట్నం టౌన్/పామర్రు/ఉయ్యూరు/పెడనరూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో ఇచ్చే విధంగా అంగన్వాడీ కేంద్రాల్లో కూడా చిన్నారులకు సన్నబియ్యం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని ఆంధ్రప్రదేశ్ ఆహార కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయ ప్రతాప్‌రెడ్డి కోరారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విజయ ప్రతాప్‌రెడ్డి గురువారం మీడియాతో మాట్లాడారు. బియ్యం తక్కువ వచ్చాయని విద్యార్థుల కడుపు కొట్టవద్దని, మధ్యాహ్న భోజనంలో ఏవిధమైన పొరపాట్లు జరగకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఉచిత బియ్యం భోజనాలను పర్యవేక్షిస్తున్నామన్నారు. పీఎం మాతృ వందనయోజన కింద కేంద్రం మొదటి డెలివరీ రూ.5వేలు, రెండవ డెలివరీలో ఆడపిల్ల పుడితే ఆరువేల రూపాయలు అందిస్తున్నామన్నారు. ఏమైనా సమస్యలుంటే 9490551117కు సమస్యలపై వీడియోలు పంపవచ్చన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో శోభన్‌బాబు, సోషల్ వెల్ఫేర్ డీడీ షాహెద్ బాషా, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి ఎం.ఫణిధూర్జటి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభిరుచి మేరకు ఆహారం అందించాలి

విద్యార్థుల అభిరుచుల మేరకు ఆహారాన్ని అందించాలని ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాపరెడ్డి అన్నారు. కృష్ణా జిల్లా పర్యటనలో భాగంగా గురువారం పామర్రులోని బీసీ సంక్షేమ వసతి గృహంతోపాటు, ఎన్టీఆర్ కాలనీలోని అంగన్వాడీకేంద్రాన్ని, రేషన్ దుకాణాలు, నిమ్మకూరు ఏపీఆర్జేసీ కళాశాల, పాఠశాలలను తనిఖీ చేశారు. అలాగే ఉయ్యూరులో గిరిజన బాలుర సంక్షేమ వసతి గృహ పాఠశాలను సందర్శించారు. వంటశాలలో ఆహార పదార్థాలు, స్టోర్ రూమ్ రికార్డులు తనిఖీ చేసి, వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పెడన రూరల్‌లోని బల్లిపర్రు గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.రమేష్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎం.మోహనబాబు, నిమ్మకూరు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీకుమారి, ఐసీడీఎస్ అధికారి సన్యాసమ్మ, పీడీఎస్ డీటీలు పాల్గొన్నారు.

కబ్జా కుట్రలు!

(5వ పేజీ తరువాయి)

చేసినట్టుగా చూపి, ముగ్గురి నుంచి నలుగురు చేతులు మారినట్టుగా రికార్డులు సృష్టించి, రిజిస్ట్రార్ కార్యాలయంలో దొంగ రిజిస్ట్రేషన్ చేయించారు. సర్కారుతోట, చిలకలపూడి ప్రాంతాల్లోని భూములు 22-ఎలో ఉండిపోవడంతో క్రయవిక్రయాలు జరిగినా రిజిస్ట్రేషన్‌లు జరిగేవి కావు. ఈ ప్రాంతంలో ఇళ్లస్థలాలు రిజిస్ట్రేషన్‌లు జరిగేలా చూడాలని ఈ రెండు ప్రాంతాల్లో నివాసం ఉండేవారు అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతులు సమర్పించారు. స్పందించిన అధికారులు ఈ ఏడాది ఫిబ్రవరి 19న ఈ రెండు ప్రాంతాల్లోని నివాస ప్రాంతాలను 22-ఎలో నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. నాలుగు నెలల క్రితం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి మంత్రి కొల్లు రవీంద్ర చేతుల మీదుగా సర్కారుతోట, చిలకలపూడి ప్రాంతాలను 22-ఎ నుంచి తొలగిస్తున్నట్లు జారీ చేసిన ఉత్తర్వులను స్థానికులకు అందజేశారు. 22-ఎ నుంచి భూములను తొలగించే ముందు మునిసిపల్, రెవెన్యూ అధికారులు సర్వే చేసిన సమయంలో సర్వే నెంబరు 357/1, 360లలో పాఠశాల స్థలం 40సెంట్లు ఉన్నట్లుగా రెవెన్యూ రికార్డులలో నమోదు చేశారు.

ఇంటి పన్ను విధిస్తూ ఉత్తర్వులు

పాఠశాల స్థలాన్ని ఆక్రమించిన నలుగురు వ్యక్తులు ఈ భూమిని తాము కొనుగోలు చేశామని, రిజిస్ట్రేషన్ కూడా జరిగిందని, ఈ స్థలం సర్వే చేసి ఇంటిపన్ను విధించాలని మునిసిపల్ కార్యాలయ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో ఆక్రమణదారుల పేర్లు కాకుండా బినామీ పేర్లను చేర్చి తలుపు నెంబరు 19/390లో నలుగురు నివాసం ఉంటున్నట్టుగా చూపి అసెస్‌మెంట్ నెంబర్లను కేటాయించారు. వీరు నివాసం ఉండే ప్రాంతంలో ఎలాంటి విద్యాసంస్థ లేదని పేర్కొంటూ మచిలీపట్నం నగరపాలకసంస్థ కమిషనర్ సంతకం చేసినట్టు పత్రాలను చూపుతున్నారు. నిజానిజాలు మునిసిపల్ అధికారులు తేల్చాల్సి ఉంది. పాఠశాల స్థలం కబ్జాకు గురికాకుండా అడ్డుకుని తీరతామని, అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని స్థానికులు చెబుతున్నారు.

హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఎస్‌ఐగా పదోన్నతి

విజయవాడ సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో హెడ్ కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న 12 మంది అసిస్టెంట్ సబ్ ఇనస్పెక్టర్(ఏఎస్ఐ)లుగా పదోన్నతి సాధించారు. కె.ఎ స్.నారాయణ, టి.వి.శివయ్య, జె.మన్మధరావు, షేక్ షంషుద్దీన్, సయ్యద్ ఉమర్ ఫరూక్, హబీబ్ రెహ్మాన్, ఎస్.శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వరరావు, వై.సురేష్, బి.రంగారావు, ఎస్.వి.రంగయ్య, బి.ప్రసాదరావు ప్రమోషన్ పొందిన వారిలో ఉన్నారు. ఉద్యోగోన్నతి పొందిన సందర్భాన్ని పురస్కరించుకుని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబును కమిషనరేట్ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకుని మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ కె.జి.వి.సరిత, పోలీస్ సంఘం జిల్లా అధ్యక్షులు సోమయ్య, పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

» ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల స్నాతకోత్సవ సభలో వెంకయ్యనాయుడు



కళాశాల యాజమాన్యంతో కలిసి విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు అందజేస్తున్న వెంకయ్య నాయుడు

ఉంగుటూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ శ్రమ, పట్టుదల, మేధస్సుతో యువ ఇంజనీర్లందరూ ఉన్నత స్థాయికి ఎదగాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. ఉంగుటూరు మండలం, తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం గ్రాడ్యుయేషన్ డే(స్నాతకోత్సవం)కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు, కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సుంకర అనిల్‌తో కలిసి డిగ్రీలు పూర్తిచేసిన 585మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా జరిగిన సభలో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ 17ఏళ్లుగా ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో మంచి విద్యాబోధన చేస్తూ సమాజానికి ఉపయోగపడే యువ ఇంజనీర్లను తయారుచేయడం అభినందనీయమన్నారు. చదువంటే డిగ్రీ సంపాదించడం కాదని, సంస్కారం, విజ్ఞానం సంపాదించడమే ముఖ్యమని అన్నారు. ఏ పనైనా కష్టంతో కాదు, ఇష్టంతో చేస్తేనే కలలు సాకారమవుతాయన్నారు. మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం కనుగొనే దిశగా యువత తమ పనితీరును మెరుగుపరచుకుంటూ సరికొత్త ఆవిష్కరణలు రూపొందించాలని సూచించారు. ఎంత ఉన్నతస్థానానికి వెళ్లినా కన్నతల్లిని, పుట్టిన ఊరుని, పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను ఎప్పటికీ మరువకూడదన్నారు. కేవలం ఉద్యోగాలకే యువత పరిమితం కాకూడదని, వ్యాపారస్థాపన(ఎంట్రప్రెన్యూర్‌షిప్)మార్గాన్ని ఎంచుకుని విజయవంతం కావడానికి ప్రయత్నించాలని సూచించారు. యువతరం ముందు ఎన్ని అవకాశాలున్నాయో అన్ని సవాళ్లు కూడా వున్నాయన్నారు. ముఖ్యంగా విలువల విషయంలో సవాళ్లు ఎదురవుతున్నాయని అధ్యాపకులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతోపాటు విలువలు, సంస్కారం నేర్పించాలని సూచించారు.

తెలుగు భాషా వైభవం, సంస్కృతిని చాటిచెప్పాలి

మాతృభాషలో వున్న మాధుర్యం ఎందులోనూ లేదన్న వెంకయ్య మాతృభాషలోనే విద్య వుండాలని ప్రధాని మోదీ నిర్ణయం తీసుకున్నారన్నారు. తెలుగువారంతా తెలుగుభాషలోనే మాట్లాడాలని, గుడ్‌మార్నింగ్‌లు, గుడ్‌నైట్‌లు వద్దని, నమస్కారమే మన సంస్కారమని ఉద్బోధించారు. ఏభాషలో చదివామన్నది ముఖ్యం కాదు, ఎంత విషయపరిజ్ఞానం పెంచుకుని ఉన్నతస్థితికి చేరామన్నదే ముఖ్యమని అన్నారు. ఏభాషను బలవంతంగా రుద్దకూడదన్న ఆయన ఏభాషను కూడా మనం వ్యతిరేకించకూడదని తెలిపారు. పిజ్జాలు, బర్గర్లు వంటి జంక్‌ఫుడ్‌తో ఆరోగ్యం పాడుచేసుకోవద్దని, ఆరోగ్యానికి మేలుచేసే మన సంప్రదాయ రుచుల్ని వదలవద్దని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్, వైస్‌ప్రెసిడెంట్ లంకా అరుణ్, కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా దసరా ఏర్పాట్లు

» పూజా కార్యక్రమాలు, రూ.500 టికెట్ల అమలుపై కమిటీ సమావేశంలో చర్చించాలి

» దేవదాయ కమిషనర్ రామచంద్ర మోహన్

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 వరకు జరగనున్న దసరా ఉత్సవాలను పురస్కరించుకుని చేపట్టిన ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా ఉండాలని దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. దసరా ఏర్పాట్లపై ఈవో చాంబర్‌లో అధికారులతో కమిషనర్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైదిక క్రతువులు, సంప్రదాయబద్ధంగా నిర్ణయించిన సమయాలకు జరగాలని, పూజా కైంకర్యాలు, పరోక్ష సేవలకు తగు ప్రణాళిక ఉండాలని ఆదేశించారు. లడ్డూపోటు, అన్నప్రసాదం భవన నిర్మాణాలు త్వరగా పూర్తి కావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తుల రవాణా, క్యూల ఏర్పాటు, తాగునీరు, అన్నప్రసాదం, ఇతర ముఖ్య వసతుల ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సూచించారు. దసరా ఉత్సవాలకు తీసుకోవాల్సిన ప్రత్యేక చర్యలు గురించి కమిషనర్‌కు ఈవో వివరించారు. సమావేశంలో దసరా ఉత్సవ ప్రధాన అధికారిణి డి.భ్రమరాంబ, దేవస్థానం ఈఈలు, ఏఈలు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ రామచంద్ర మోహన్

యథావిధిగా ఆర్జిత సేవలు.. టికెట్ ధరపై మంత్రుల కమిటీలో చర్చించి నిర్ణయం

ప్రతీ ఏడాది దసరా ఉత్సవాల్లో నిర్వహించే విశిష్ట ఆర్జిత సేవలు, రూ.500 టిక్కెట్లు యధావిధిగా అమలు చేయనున్నారు. ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో వీటిని రద్దు చేయాలని ఓ అధికారి ఇటీవల జరిగిన అధికారుల సమన్వయ కమిటీ సమావేశంలో ఉన్నతాధికారులకు సూచించారు. ఆయన ప్రతిపాదనను దేవస్థానం వైదిక కమిటీ, పలువురు అధికారులు వ్యతిరేకించారు. దీనిపై దేవస్థానం ఉద్యోగుల నుంచి భక్తులు, ఉభయదాతల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ఈ విషయం కమిషనర్ దృష్టికి వెళ్లింది. దీనిపై మంత్రుల కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్టు దేవస్థానం అధికారులకు, వైదిక కమిటీకి సూచించినట్టు తెలిసింది. త్వరలో దేవదాయ మంత్రి, హోంమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రెవెన్యూమంత్రి, పలువురు ఉన్నతాధికారులతో మంత్రుల కమిటీ సమావేశం జరగనుంది. ఆ సమావేశంలో దసరాలో ఆర్జిత సేవలు, రూ.500 టిక్కెట్లు అమలుపై చర్చించనున్నట్టు సమాచారం.

రీ వెరిఫికేషన్ వాయిదాతో దివ్యాంగుల ఇబ్బందులు!

జగ్గయ్యపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : పెన్షన్ రీ-వెరిఫికేషన్‌లో భాగంగా విజయవాడ యూజీహెచ్‌కు వెళ్లిన దివ్యాంగులను పరీక్షలు నిర్వహించకుండానే వెనక్కి పంపేయటం విమర్శలకు దారితీసింది. జగ్గయ్యపేట పరిధిలో రీ వెరిఫికేషన్ పూర్తి చేయలేదని 145 మందికి పెన్షన్లు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో గురువారం విజయవాడ యూజీహెచ్‌లో వైద్యపరీక్షల నిమిత్తం జగ్గయ్యపేట నుంచి 21 మందిని, మండలం నుంచి 68 మందిని పంపారు. యూజీహెచ్‌లో సాయంత్రం వరకు వేచి ఉన్న పలువురు దివ్యాంగులను తిరిగి వచ్చేనెల 10న రీ వెరిఫికేషన్‌కు రావాలని చెప్పడంతో బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో పలువురు అంధులను ఇదేవిధంగా వెనక్కి పంపినట్టు తెలిసింది. దీనిపై మునిసిపల్ కమిషనర్ కృష్ణారావును వివరణ కోరగా నలుగురు సచివాలయ ఉద్యోగులను ఇచ్చి విజయవాడ పంపామని, అక్కడ వెనక్కి పంపిన విషయం సమాచారం లేదని చెప్పారు. ఎంపీడీవో జితిన్‌ను వివరణ కోరగా 69 మందిని ఇద్దరు ఉద్యోగులను ఇచ్చి విజయవాడ పంపామని, ఇది డీఆర్‌డీఏ పీడీ పరిధిలోనిదని చెప్పారు. అయితే వ్యయప్రయాసలకోర్చి వెళ్లిన దివ్యాంగులు రీ వెరిఫికేషన్ వాయిదాతో ఇబ్బందులు పడ్డారు.

జోగి మెడకు బిగుస్తున్న ఉచ్చు!

(5వ పేజీ తరువాయి)

ఆర్డర్ కూడా ఇచ్చారని, వాటికి సంబంధించిన దస్తావేజుల నెంబర్లు 869/2002, 870/2002, 871/2002, 872/2002, 873/2002, 874/2002, 3945/2002, 1730/2002, 1496/2002 ద్వారా అగ్రిగోల్డ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌కు చెందిన అవ్వా వెంకట శేష నారాయణరావు, వారి కుటుంబ సభ్యులు కలిగి ఉన్నారని పేర్కొనటం జరిగింది. ఈ డాక్యుమెంట్లను పరిగణనలోకి తీసుకుని నాన్ అప్రూవల్ లే అవుట్ ప్రకారం ప్లాట్లను పరిశీలించగా.. అంబాపురం గ్రామ రెవెన్యూ రికార్డుల దాఖలా ఆర్ఎస్ నెంబర్ 69/2, 87 సర్వే నెంబర్లలో భాగమై ఉన్నాయని పేర్కొన్నారు. నాన్ అప్రూవల్ ప్లాట్లను క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసిన క్రమంలో వాటి విస్తీర్ణాలను కొలిచినట్టు స్పష్టం చేశారు. ఆ తర్వాత అవ్వా వెంకట శేష నారాయణ డాక్యుమెంట్‌ను పరిశీలించిన మీదట జోగి రమేశ్ కూల్చేయించిన గోడ అవ్వ డాక్యుమెంట్ స్థలంలోనే ఉందని గుర్తించారు. అవ్వ కుటుంబ సభ్యులైన అవ్వా వెంకట కృష్ణ లాలస, అవ్వ అపురూప, వెంకట వీణసంతోషి, అవ్వ పుష్పలత, అవ్వా వెంకట సాయి కిరణ్‌లకు సంబంధించిన డాక్యుమెంట్లన్నింటినీ పరిశీలించగా, వారి ప్లాట్ల పరిధిలో ప్రహరీ గోడ ఉందని నిర్ధారించారు. ఈ స్థలం వెంబడి ఉన్న గుంటక ఆదిలక్ష్మి, కావూరి వసుంధర, గుండు వెంకటేశ్వరరావు, పోతుల హరికిశోర్, కలం బుజ్జిబాబు, దాసరి చెన్నం నాయుడు, సురేష్ గుర్జార్, దేవరా జుగట్టు బెనర్జీ, పోలవరపు మురళీ, పోలవరపు మురళీమోహన్, రామిశెట్టి రాంబాబు, దవరా మహిపాల్ జయశుక్, పగిడిపాటి సుబ్బారెడ్డి వంటి వారికి సంబంధించి డాక్యుమెంట్లను పరిశీలించటంతో పాటు, వారిని పూర్తి స్థాయిలో విచారించటం జరిగింది. ఈ విచారణలో వీరి స్థలాల హద్దులలో వివిధ దిక్కులలో అగ్రిగోల్డ్ భూములు ఉన్నాయని గుర్తించారు. కాబట్టి పెదపాడు పోలీసు స్టేషన్ కేసుకు సంబంధించి హోమ్ డిపార్ట్‌మెంట్ అటాచ్‌మెంట్‌లో ఉన్న అగ్రి గోల్డ్ భూములేనని తేల్చటం జరిగింది. దీంతో జోగి రమేశ్ తన కుటుంబ సభ్యుల పేరుతో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకోవటం, వాటిని తిరిగి వేరే వారికి విక్రయించటం వంటివి పూర్తిగా అక్రమమని సంయుక్త విచారణ కమిటీ తేల్చింది. వీరు ఇచ్చిన నివేదిక సీఐడీకి చేరటంతో.. తదుపరి దర్యాప్తు ప్రక్రియను ఇక సీఐడీ ప్రారంభించనుంది.

అక్రమ మైనింగ్ @ రూ.156.81 కోట్లు

(5వ పేజీ తరువాయి)



విజయవాడ రూరల్ మండలంలో తరిగిపోతున్న కొండలు

గ్రావెల్ /మట్టి రవాణా చేసినట్టుగా నిర్ధారించారు. విజయవాడ వెస్ట్ బైపాస్ పనులను చేపడుతున్న మేఘా ఇంజనీరింగ్ సంస్థకు షోకాజు నోటీసు ఇవ్వటంతో పాటు రూ.21.63 కోట్ల జరిమానాతో కూడిన డిమాండ్ నోటీసు పంపారు.

- వెలగలేరు గ్రామంలో సర్వే నెంబర్లు 501/2, 504/4ఈ, 508/ఏ, డీ, 509/1, 3సీ - 1, 2, 3 ఎఫ్, 3 బీ, హెచ్, 510 /3డీ, 3ఎఫ్, 511/5సీ, 5డీ, 4ఎఫ్, ఐ, 512 / బీ, ఎఫ్, జీ, హెచ్, ఐ, జే, హెచ్, ఎం, ఎల్, 520/ జే, కే, 521/ ఈ, ఎఫ్, జీ, ఐ, 522/ఈ, 523/డీఈహెచ్ఐఎం, 524/బీసీ, డీ.ఎఫ్.జీ, హెచ్, జే, కే, 525 /ఏ, డీ, ఎఫ్, ఈ, హెచ్, ఐ లలో 5.75 లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ /మట్టి తవ్వి రవాణా చేసినట్టుగా మైనింగ్ శాఖ అధికారులు నిర్ధారించారు. మొత్తం 59 మంది అక్రమార్కులు అక్రమ తవ్వకాలకు పాల్పడినట్టుగా గుర్తించి, రూ.31.91 కోట్ల మేర అపరాధ రుసుం విధిస్తూ డిమాండ్ నోటీసు ఇచ్చారు.
- పి.నైనవరం గ్రామంలో సర్వే నెంబర్ 101/1, 2, 5, 7, 8,9, 103/1, పీఐపీఎల్ ఎంసీ 103/2లలో 2,60,140 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ /మట్టి తవ్వకాలు జరిపిన వ్యక్తికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. రూ.14.42 కోట్ల అపరాధ రుసుంతో కూడిన డిమాండ్ నోటీసును ఇచ్చారు.
- వేమవరం గ్రామంలో సర్వే నెంబర్లు 147/6, 2ఏ, 2బీ, 2, 4, 5, 6, 7, 8, 10లలో 5,59,087 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ /మట్టిని తవ్వి రవాణా చేసినట్టు నిర్ధారించారు. 18 మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. రూ.30.99 కోట్ల అపరాధ రుసుంతో కూడిన డిమాండ్ నోటీసులను అందజేశారు.
- జక్కంపూడి గ్రామంలో సర్వే నెంబర్ 88లో 1,54,704 క్యూబిక్ మీటర్ల కంకరకు అనుమతి ఇచ్చారు. ఇక్కడ ఇద్దరు వ్యక్తులు 1,710 క్యూబిక్ మీటర్ల గ్రావెల్/మట్టిని అక్రమంగా తవ్వారు. వారికి రూ.50 వేల డిమాండ్ నోటీసు ఇచ్చారు.
- పాతపాడు గ్రామంలో మరో ఇద్దరు ప్రైవేటు వ్యక్తులు అనధికారికంగా 354 క్యూబిక్ మీటర్ల గ్రావెల్/మట్టిని తవ్వటం వల్ల ఆ ఇద్దరికీ వేర్వేరుగా రూ.20,320, రూ.66,000 అపరాధ రుసుం విధించారు.
- జీ కొండూరు మండల పరిధిలో కూడా అక్రమంగా గ్రావెల్, మట్టి తవ్వినవారిని గుర్తించారు. వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయటంతో పాటు అపరాధ రుసుం విధిస్తూ డిమాండ్ నోటీసులు ఇచ్చారు.

జోరుగా పేకాట!

(5వ పేజీ తరువాయి)

శిబిరాలకు తరలిస్తున్నారు. వారి వద్ద నగదు డిపాజిట్ చేయించుకుని వారికి ప్లాస్టిక్ కాయిన్స్ ఇస్తున్నారు. నిర్వాహకుడు గత 20 ఏళ్లుగా స్థానికంగా ఉండే నియోజకవర్గ ప్రజాప్రతినిధులకు నమ్మకంగా ఉంటూ వారి మద్దతుతో శిబిరాలు నడుపుతున్నట్టు సమాచారం. కూటమి నాయకుడు కావటంతో పోలీసులు కూడా అడ్డుకోలేకపోతున్నారని తెలిసింది. పెడన మండలంతో పాటు బంటుమిల్లి మండలం మూలలంకకు కూడా శిబిరాలు మారుస్తున్నట్టు సమాచారం. ఇక్కడ పోలీస్ రైడ్ జరగదన్న నమ్మకంతో ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన ఆటగాళ్లు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఇక్కడ ఆటగాళ్ల మర్యాదలకు ఏమాత్రం లోటు ఉండదు. ఆటగాళ్ల స్థాయిని బట్టి మందు, విందు, వినోదం ఏర్పాట్లు చేస్తున్నారు.

స్పాట్ ఫైనాన్స్ సౌకర్యం

పేకాటలో డబ్బులు పోగొట్టుకున్న వారికి స్పాట్ ఫైనాన్స్ సౌకర్యాన్ని కూడా నిర్వాహకులు కల్పిస్తున్నారు. ఒంటి మీద బంగారం, కార్లు, బైక్‌లు తాకట్టు పెట్టుకుని రుణాలు కూడా ఇచ్చి ఆటగాళ్లను ప్రోత్సహిస్తున్నారు. తీసుకున్న రుణానికి వడ్డీ రోజురోజుకు పెరుగుతూనే ఉంటుంది. వీళ్లకు వడ్డీలు కట్టేకంటే తాకట్టు పెట్టిన వస్తువును వదులుకోవటమే మేలని ఆటగాళ్లు భావిస్తున్నారు. పలువురు ఆటలో డబ్బులతో పాటు అధిక వడ్డీలకు రుణాలు తీసుకుని కట్టలేక బంగారం, కార్లను కోల్పోయిన సందర్భాలున్నాయి.

పోలీసుల ఉదాసీనం

ఇంత జరుగుతున్నా పోలీసులు మాత్రం పెడన సర్కిల్‌లో ఎటువంటి జూదాలు జరగటం లేదని చెబుతున్నారు. కూటమి నేతలతో అంటకాగుతూ పేకాటకు సహకరిస్తూ ముడుపులు అందుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల పేకాట నిర్వాహకుడు కొంకేపూడిలో ఇచ్చిన ఆత్మీయ విందుకు పలువురు పోలీస్ అధికారులు హాజరుకావడం గమనార్హం.



ఫైర్ డీజీగా బాధ్యతలు తీసుకుంటున్న వెంకటరమణ

ఫైర్ డీజీగా వెంకటరమణ

విజయవాడ సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : అగ్ని మాపక శాఖ డైరెక్టర్ జనరల్‌గా పి.వెంకటరమణను ప్రభుత్వం నియమించింది. స్టేట్ ట్రైనింగ్ సెంటర్‌లో ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్‌గా పని చేసిన ఆయన్ని రాష్ట్ర అగ్నిమాపక శాఖకు బదిలీ చేసింది. విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో ఫైర్ సర్వీసెస్ డీజీగా ఆయన ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. 1998 గ్రూప్-1 ఆఫీసర్‌గా ఎపికైన ఆయన కృష్ణాజిల్లా అగ్నిమాపక శాఖ అధికారిగా పని చేశారు. ఆ తరువాత రీజనల్ ఫైర్ ఆఫీసర్‌గా ఉద్యోగోన్నతి పొంది విశాఖపట్నం, హైదరాబాద్‌లో పని చేశారు. ఫైర్ డీజీగా బాధ్యతలు తీసుకున్న వెంకటరమణను కార్యాలయ అధికారులు, సిబ్బంది సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. వెంకటరమణను ఫైర్ డీజీగా నియమించినందుకు సీఎం చంద్రబాబునాయుడు, డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోం మంత్రి అనితకు కార్యాలయ అధికారులు, సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు.

రేషన్ బియ్యంకు రెక్కలు


» రెచ్చిపోతున్న అక్రమార్కులు

» పొరుగు ప్రాంతాల నుంచి వచ్చి దందా

» మామూళ్ల మత్తులో జోగుతున్న పౌరసంబంధాల అధికారులు

» పోలీసులకు నెలావారీ మామూళ్లు

» తూతూమంత్రంగా అధికారుల దాడులు



కొండపల్లిలో పట్టుబడిన రేషన్ బియ్యం

(ఇబ్రహీంపట్నం-ఆంధ్రజ్యోతి) పీడీఎస్ బియ్యానికి రెక్కలొస్తున్నాయి. పౌరసంబంధాలశాఖలో మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారుల అండదండలతో రేషన్ బియ్యం దందా మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల వద్దకు వచ్చే ఎండీయూ వాహనాల్లో రేషన్ బియ్యం ఇవ్వకుండా వేలిముద్రలు వేయించుకొని అదే వాహనంలో బియ్యాన్ని అక్రమ రవాణా చేసి విక్రయించి సొమ్ము చేసుకునేవారు. కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దుచేసినా అక్రమ వ్యాపారం మాత్రం కట్టడి కావడం లేదు. కొందరు రేషన్ డీలర్లు నేరుగా కార్డుదారులచే వేలి ముద్రలు తీసుకొని బియ్యానికి నగదు ఇచ్చి అక్రమ వ్యాపారానికి తెరదీస్తున్నారు. రేషన్ దుకాణాల తనిఖీకి వచ్చే ముందే పీడీఎస్ అధికారులు డీలర్లకు లీకులిచ్చి ముందు రాత్రే షాపుల్లో ఉన్న సరుకు బయటకు పోయేలా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

- అక్రమార్కులు కార్డుదారుకు కిలో రూ.14 చొప్పున నగదు చెల్లిస్తు ఇళ్ల వద్దకు వచ్చి బియ్యాన్ని సేకరిస్తున్నారు. సేకరించిన బియ్యాన్ని రహస్య ప్రాంతంలో ఉంచి వ్యాన్లకు లోడ్ చేసి తరలిస్తున్నారు. రేషన్‌షాపులో రూ.12లకు డీలర్లు కార్డుదారుకు నగదు చెల్లిస్తున్నారు. ఇందుకోసం వారికి సహాయకులుగా ఎండీయూ వాహనాల ఆపరేటర్లను వినియోగిస్తున్నారు.
- రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం చేసే వారు పౌరసంబంధాల, పోలీస్‌శాఖ అధికారులకు నెలవారీ కింద లక్షల్లో మామూళ్ల ఇస్తుండటంతో పెద్ద మొత్తంలో బియ్యం అక్రమంగా తరలిపోతున్నా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. నామమాత్రపు దాడులు చేసి అక్రమ వ్యాపారానికి అడ్డు పడకుండా కొందరు అధికారులు అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారు.
- ఇది నా ఏరియా.. ఇక్కడకు వచ్చి వ్యాపారం చేయడానికి వాడెవడు. వాడు ఎక్కడ దొరుకుతాడో చూడండి పట్టిద్దాం అని ఒకడు.. ఎలా పట్టిస్తాడో చూస్తా అని మరొకడు.. ఇలా అక్రమ వ్యాపారులు రెచ్చిపోతున్నారు. మా ప్రాంతానికి రండి వ్యాపారం చేసుకోండి.. మా వాటా చాలు మీపైకి ఎవరూ రాకుండా చూస్తాం.. అని ఇటీవల కొందరు అధికార పార్టీ నేతలు పొరుగు ప్రాంతాలకు చెందిన అక్రమ వ్యాపారులకు అండకాస్తున్నారు. దీంతో స్థానికంగా ఉన్న వ్యాపారులు వారిపై గుర్రుగా ఉంటున్నారు. వారిలో వారికే పడక కొందరు పట్టుబడుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి బియ్యం అక్రమ వ్యాపారుల భరతం పట్టి పౌరసరఫరా వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 490

సీపీఆర్‌పై అవగాహన



ఉంగుటూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గుండెపోటు వచ్చిన వ్యక్తి ప్రాణాలను కాపాడేందుకు అత్యవసరంగా అందించే సీపీఆర్(కార్డియోపల్మనరీ రిససిటేషన్)ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సూచించారు. ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో శిక్షణార్థులకు సీపీఆర్‌పై డాక్టర్ కొడాలి లావణ్య(ఎన్నారై) ఆధ్వర్యంలో గురువారం శిక్షణ ఇచ్చారు.. ముఖ్యఅతిథిగా వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. సీపీఆర్ ద్వారా కార్డియాక్ సమస్యలతో వచ్చే మరణాలను అదుపుచేయవచ్చునని లావణ్య వివరించారు. ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పరదేశి, ట్రస్ట్ యాజమాన్యం, శిక్షణార్థులు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె

రూ.6.43 కోట్ల సీఎంఆర్‌ఎఫ్ అందించాం

• ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఆరోగ్య సమస్యలున్న 705 మంది చికిత్స కోసం ఇప్పటి వరకు రూ.6.43 కోట్ల ముఖ్యమంత్రి సహాయనిధిని అందించామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలిపారు. గురువారం పోరంకి టీడీపీ కార్యాలయంలో తాడిగడప మునిసిపాలిటీకి చెందిన 35మందికి రూ.17లక్షల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. నేతలు యార్లగడ్డ సుచిత్ర, మల్లంపాటి విజయలక్ష్మి, అనంతనేని ఆజాద్, ముసునూరు శ్రీనివాసరావు, పీతా గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

తాడిగడప మునిసిపాలిటీలోని పోరంకి కృష్ణవేణి పాఠశాల వద్ద రూ.5లక్షల నిధులతో నిర్మిస్తున్న డ్రెయినేజీకి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శంకుస్థాపన చేశారు. మునిసిపాలిటీకి నీటి పన్ను బకాయిలను చెల్లించి సహకరించాలని ప్రజలను కోరారు. తుమ్మలపల్లి హరికృష్ణ, సంగెపు రంగారావు, యేకుల విజయేంద్ర, తాతపూడి గణేష్, శొంఠి శివరాంప్రసాద్ పాల్గొన్నారు.

కొరత లేకుండా ఎరువులందిస్తాం

• కలెక్టర్ లక్ష్మీశ



రైతుకు ఎరువులు అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమృద్ధిగా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎరువులు, పురుగుమందులు కొరత లేకుండా రైతులకు అందిస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. నున్న పీఏసీఎస్‌ను గురువారం ఆయన పరిశీలించారు. రైతులకు ఎరువుల సరఫరా, ఈ పాస్ మిషన్ పనితీరును ఆయన పరిశీలించారు. అందుబాటులో ఉన్న ఎరువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈపాస్ ద్వారా బయోమెట్రిక్ ధ్రువీకరణతో నిమిషాల వ్యవధిలోనే ఎరువులు అందించడంపై రైతులు సంతృప్తిగా ఉన్నారని ఆయన చెప్పారు. ఎరువులు, పురుగుమందులు, విత్తనాల గోదామును తనిఖీ చేశారు. జిల్లాలో 5,403 మెట్రిక్ టన్నుల యూరియా, 2,251 మెట్రిక్ టన్నుల డీఏపీ, 1052 మెట్రిక్ టన్నుల ఎంవోపీ, 2310 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ, 12292 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్‌తో కలిపి మొత్తం 23,310 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. నానో ఎరువుల వినియోగంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని నానో యూరియా, నానో డీఏపీ ఉపయోగించడం వలన రైతులకు మేలు చూకూరుతుందని తెలిపారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు అమ్మడం, అడిగిన ఎరువులు కాకుండా వేరే ఎరువులు ఇవ్వడం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అవకతవకలపై కలెక్టరేట్‌లోని 91549 70454 నెంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయకుమారి, తహసీల్దార్ సుగుణ, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నాగమల్లిక, వ్యవసాయ అధికారులు బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రయాణికుల రద్దీకి తగ్గట్టు ఏర్పాట్లు చేయండి : యార్లగడ్డ



గన్నవరం ఆర్టీసీ డిపో అధికారులతో ఎమ్మెల్యే

ప్రసాదంపాడు, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీకి తగినట్టు చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఆదేశించారు. గురువారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో గన్నవరం డిపో మేనేజర్, సూపర్‌వైజర్లతో మహిళల ఉచిత ప్రయాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. బస్టాండ్, బస్టాప్‌ల్లో ప్రయాణికులు కూర్చునేందుకు వీలుగా తగినన్ని బెంచ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. గన్నవరం డిపోలో 61 ఉండగా 54 బస్సులు మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని డిపోమేనేజర్ శివాజీ వివరించారు.



సతీష్‌కుమార్ ఫామ్‌హౌస్‌లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎమ్మెల్యే కామినేని

దివ్యాంగులను చేరదీయండి

• మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను అక్కున చేర్చుకుని వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. జంక్షన్‌లో గురువారం విశ్వహిందూ పరిషత్ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్‌కు చెందిన ఫామ్‌హౌస్‌ను ఆయన సందర్శించారు. కృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. గోశాలను సందర్శించి కపిల గోవులకు పూజలు చేశారు. ఆశాజ్యోతి మానసిక దివ్యాంగులకు వెంకయ్యనాయుడు చేతులమీదుగా పుట్టగుంట సతీష్‌కుమార్ దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఆంధ్రా హాస్పిటల్ ఎండీ పీవీ రమణమూర్తి, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్లు గద్దె శేషగిరి, జేఎన్ శంకర్‌గుప్తా, మిరియాల వెంకటేశ్వరరావు, కొల్లి వెంకటకృష్ణప్రసాద్, హనుమాన్‌జంక్షన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌చక్రవర్తి, నందిగం స్వామి, యలమంచిలి శ్రీరామచంద్రమూర్తి, ఆశాజ్యోతి దివ్యాంగుల పాఠశాల నిర్వాహకురాలు మాధవీలత పాల్గొన్నారు.

స్థలం అక్రమ అమ్మకానికి యత్నం

• తహసీల్దారు ఫిర్యాదుతో కేసు నమోదు

పెనమలూరు, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): కానూరు గ్రామంలో 249-3, 4, 5ఏ సర్వే నంబర్లలోని 300గజాల స్థలాన్ని అక్రమంగా అమ్మకానికి యత్నించిన వ్యక్తులపై తహసీల్దారు గోపాలకృష్ణ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. 2024 ఆగస్టులో పోలుకొండ వెకటాచలం అనే మహిళ లక్ష్మణరావు, వేములపల్లి శ్రీనివాసరావు సాయంతో కానూరులోని 249సర్వే నంబర్‌లోని 300 గజాల స్థలాన్ని నకిలీ ఎండార్స్‌మెంటు ఆధారంగా తన మనుమడు పోలుకొండ కౌశిక్‌కు కంకిపాడు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో గిఫ్ట్ డీడ్ చేయించింది. దీంతో తన స్నేహితులు కామోదుల సూరిబాబు, వలి, బోరుగడ్డ కుమార్‌తో కలిసి కౌశిక్ ఆ స్థలాన్ని విక్రయించడానికి ప్రయత్నించాడు. ఈ స్థలంపై విక్రయంపై రూ.లక్ష అడ్వాన్సు కూడా తీసుకున్నారు. ఎండార్స్‌మెంట్‌కు దరఖాస్తు చేయగా, భూమి సరిపోలడం లేదని గుర్తించిన సర్వేయర్ దరఖాస్తును తిరస్కరించారు. దీనిపై తహసీల్దార్‌కుసమాచారమందించారు. భూమి అక్రమ అమ్మకానికి యత్నిస్తున్నట్టు గుర్తిం చాం. సమగ్ర దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలి' అని తహసీల్దార్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: తహసీల్దార్

పెనమలూరు తహసీల్దారు కార్యాలయం జారీ చేసిందని చెబుతూ నకిలీ ఎండార్స్‌మెంట్లతో అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడుతున్న వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు గోపాలకృష్ణ సూచించారు. ఇతరుల ఆస్తులను అన్యాక్రాంతం చేయడానికి యత్నించిన వ్యక్తులపై తాము పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఎండార్స్‌మెంట్లు జారీ చేసినదీ లేనిదీ స్వయంగా తహసీల్దారు కార్యాలయానికి వచ్చి ధ్రువీకరించుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు.

9 పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీల నియామకం

ఉంగుటూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తొమ్మిది పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మొత్తం 14పీఏసీఎస్‌లకు గతనెలలో తొలివిడతగా ఆముదాలపల్లి, ఎలుకపాడు, మానికొండ, వేమండ, వేంపాడు పీఏసీఎస్‌ల త్రిసభ్యకమిటీల నియామక ప్రక్రియ పూర్తై పదవీ బాధ్యతలు స్వీకరించారు. మిగిలిన 9 పీఏసీఎస్‌ల్లో ఆత్కూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా సబ్బినేని తనూజ, సభ్యులుగా దాసరి శ్రీనివాసరావు, వరదా అచ్యుతరావు, ఇందుపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా చెరుకుమిల్లి వేణు, సభ్యులుగా మసిముక్కు పిచ్చేశ్వరరావు, గోగం రాంబాబు, కొయ్యగూరపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా డాక్టర్ పాటూరు రత్నాకర్, సభ్యులుగా మేకల వెంకటేశ్వరరావు, పొనుగుమాటి సురేష్, పెదఅవుటపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా ఆళ్ల చిరంజీవి మల్లికార్జునరావు, సభ్యులుగా మరీదు వెంకటశివరంగారావు, పావులూరి జోజిబాబు, పొణుకుమాడు పీఏసీఎస్ చైర్మన్‌గా సుంకర రాజేష్, సభ్యులుగా పడమట అర్జునరావు, కడవకొల్లు వసంతరావు, పొట్టిపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా అట్లూరి జోషిమధు, సభ్యులుగా నిమ్మకూరు మాణిక్యాలరావు, చొప్పర శ్రీరామతులసి, తేలప్రోలు పీఏసీఎస్ చైర్మన్‌గా ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, సభ్యులుగా సాంబిరెడ్డి రాము, చౌటపల్లి రాణి, ఉంగుటూరు పీఏసీఎస్ చైర్మన్‌గా ఈడ్పుగంటి కృష్ణమూర్తి, సభ్యులుగా నేతల బుజ్జిబాబు, బంకుర ప్రసాద్, వెల్దిపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా నెక్కలపూడి వెంకటరాజమన్నార్, సభ్యులుగా కొట్నాని శ్రీనివాసరావు, పాతూరి శివరంగారావును కూటమి ప్రభుత్వం నియమించింది.

కాటూరులో సుపరిపాలనలో తొలి అడుగు

ఉయ్యూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలుచేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చుతున్నారని తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి అన్నారు. కాటూరులో గురువారం ఆయన పర్యటించారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించి కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఇంటింటా ప్రచారం చేశారు. సజ్జా మధు, వేమూరి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సజ్జా అనూష, కోడె హరీశ్, యుగబాబు పాల్గొన్నారు.

తలసేమియా బాధితుల కోసం రక్తదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తలసేమియా బాధితులకు రక్తదానం చేయడం అభినందనీయమని పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ జీఎం టీవీ రమణ అన్నారు. ఆంపాపురంలోని పతంజలి ఫుడ్స్ సహకారంతో ఏలూరు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం జీఎం రమణ పుట్టినరోజు సందర్భంగా తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తనతో కలిసి రక్తదానం చేసిన 82మంది సిబ్బందిని డీజీఎం కలపాల శ్రీనివాసరావు అభినందించారు. హెచ్ఆర్ జి.చంద్రశేఖరరావు, రెడ్‌క్రాస్ పీఆర్వో రమణ, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.



శిక్షణకు వచ్చిన వారితో డీఐసీ జీఎం వెంకట్రావు

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

గన్నవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని డిస్ట్రిక్ ఇండస్ట్రీస్(డీఐసీ) జీఎం ఆర్.వెంకట్రావు పిలుపునిచ్చారు. ఆర్‌ఏఎంపీ పథకం కింద గుడివాడ, పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల నుంచి బిజినెస్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ ప్రొవైడర్లుగా ఎంపికైన మహిళలరే సూరంపల్లి ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఏపీ ఎంఎస్ఎంఈ, ఎలీప్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. వ్యాపార సంస్థలు ప్రారంభించి మహిళలు తమ కాళ్లపైన తాము నిలబడడమే కాకుండా పదిమందికి ఉపాధి చూపాలని వెంకట్రావు సూచించారు. కనకదుర్గ, అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

గన్నవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): 'మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్తకొత్త వ్యాధులు వస్తున్నాయి. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి.' అని కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు సూచించారు. చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఆరోగ్య అవగాహన ప్రదర్శన గురువారం కొనసాగింది. వైద్యం పట్ల అందరికీ అవగాహన కల్పించేందుకే ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సిద్ధార్థ అకాడమీ ఏటా వేల మంది విద్యార్థులను సమాజానికి అందిస్తోందని తెలిపారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన స్టాల్స్ గురించి వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంపీ భీమేశ్వర్, ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

దంత వైద్య కళాశాలలో..

డాక్టర్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో ఎక్స్‌ప్లోర్-25 ఎగ్జిబిషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంపీ రామోజీరావు ఆధ్వర్యంలో కొనసాగింది. 9 విభాగాల్లో స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు సందేహాలను నివృత్తి చేశారు. దంతాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం లభిస్తుందని డాక్టర్ రామోజీ తెలిపారు. హెచ్‌వోడీలు డాక్టర్ కాశేశ్వరరావు, కోటేశ్వరరావు, అజయ్ బెనర్జీ పాల్గొన్నారు.

పల్లెల్లోనే నిజమైన క్రీడా ప్రగతి

గన్నవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పల్లెల్లోనే నిజమైన క్రీడా ప్రగతి దాగి ఉన్నదని వెలికితీస్తే దేశం గర్వించదగ్గ ఆణిముత్యాలు వెలుగు లోకి వస్తాయని గన్నవరం రోటరీ క్లబ్ అధ్యక్షుడు జీవీ రవిబాబు అన్నారు. బాలుర ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. తల్లిదండ్రులు పిల్లలను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని సూచించారు. పీడీలు ధనియాల నాగరాజు, షేక్ మీరా సాహెబ్ పోటీలు నిర్వహించారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కూరగాయలు, ఇతర పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు ఏవో రంగనాథబాబు, ఉద్యాన శాఖాధికారి జోసఫ్ సూచించారు. వేలేరు, కొత్తపల్లి, మడిచర్లల్లో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. కూరగాయ తోటలు, ఆయిల్‌పామ్, చెరుకు తోటలను రైతులతో కలిసి పరిశీలించారు.

దేశంలో బుల్డోజర్ పాలన

మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు

గన్నవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): దేశంలో బుల్డోజర్ పరిపాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విమర్శించారు. యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు నీలం ప్రభాకరరావు అధ్యక్షతన గురువారం ఎన్జీవో కార్యాలయంలో యూటీఎఫ్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అప్రకటిత ఎమర్జెన్సీ నాడు-నేడుపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీని ప్రత్యక్షంగా విధించకుండానే ఆ విధానాలు అమలు చేస్తోందని కేఎస్ లక్ష్మణరావు అన్నారు. నాడు మీసా చట్టాన్ని అమలు చేస్తే, నేడు ఉపా చట్టం కింద వేలాదిమందిని విచారణ లేకుండా జైళ్లలో పెడుతున్నారని అన్నారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక 14 ఏళ్లలో చెయ్యకూడని పనులన్నీ చేస్తోందన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిగుమతులపై 50శాతం పన్నులు వేయడం వల్ల రొయ్యల పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. ఆర్థిక విశ్లేషకుడు గన్నె వెంకట్రావు, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్ పాల్గొన్నారు.

ఎట్టివాగు వంతెనకు మరమ్మతులు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 7(ఆంధ్ర జ్యోతి): ఎట్టివాగుపై వంతెన బురదమయంగా మారడంతో ప్రజలు, రైతులు పడుతున్న ఇబ్బందులను ఆంధ్రజ్యోతి వరసు కథనాలు ప్రచురించింది. స్పందించిన అధికారులు వర్షాలు తగ్గడంతో ప్రమాదకరంగా ఉన్న వంతెనను బుధవారం తొలగించారు. 4 తూములను ఏర్పాటు చేసి 50టన్నుల కంకరతో గురువారం రహదారికి మర్మమతులు చేశారు. సింగన్నగూడెం నుంచి మల్లవల్లి రహదారిపై గుంతలను పూడ్చి పనులు మొదలు పెట్టడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రంగన్నగూడెం సర్పంచ్ కసుకర్తి రంగామణి, ఉపసర్పంచ్ బెజవాడ వెంకటకృష్ణారావు, అక్కినేని నాగరాజు, టీడీపీ నేత అక్కినేని ధర్మరాజు మరమ్మతులను పర్యవేక్షించారు.

రోడ్డు అభివృద్ధి పనుల పరిశీలన

కంకిపాడు : ఈడుపుగల్లు పరిధిలోని గోసాల సెంటర్‌లో రహదారిని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సహకారంతో అభివృద్ధి చేస్తున్నామని సర్పంచ్ పందిపాటి ఇందిర తెలిపారు. రహదారి అభివృద్ధి పనులను గురువారం ఆమె పరిశీలించారు. చిన్నపాటి వర్షం కురిస్తే గోసాల సెంటర్‌లో రోడ్డు చెరువును తలపిస్తుందని ఆమె అన్నారు. పంచాయతీరాజ్ అధికారులతో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడి అభివృద్ధి చేయిస్తున్నారన్నారు. పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు, ఏఈ రాజేష్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు షేక్ షకార్, జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్ పాల్గొన్నారు.

బూత్ కమిటీలను బలోపేతం చేయాలి

కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి

గన్నవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో బూత్ కమిటీలను బలోపేతం చేయాలని కార్యకర్తలకు బీజేపీ సీనియర్ నాయకుడు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి సూచించారు. బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నీలం అశోక్ అధ్యక్షతన గురువారం కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందే విధంగా చూడాలని కుమారస్వామి సూచించారు. నాయకులు నాదిండ్ల మోహన్, కురుమద్దాల ఫణికుమార్, కానూరు శేషుమాధవి, వెంకట కృష్ణా, చంద్రశేఖరరెడ్డి, రామకోటి, వెంకటేశ్వర్‌రెడ్డి, మేడూరి శేషుబాబు, అనిల్, శ్రీను కోటేశ్వరరావు, వీరాంజనేయులు, రాజు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు



అందుకున్న మెమెంటోలతో విద్యార్థులు

పెనమలూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడానికి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ మేరా యువభారత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహనా సదస్సు నిర్వహించారు. దేశంలోని పేద, మధ్యతరగతి వర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహిస్తోందని జిల్లా యువజన అధికారి సుంకర రాము తెలిపారు. ఈ యాత్ర ద్వారా పథకాలపై అవగాహన కల్పిస్తోందని ఆయన తెలిపారు. వికసిత్ భారత్ సాధనలో డిజిటల్ ఇండియా పాత్ర ఎంతో ప్రధానమైనదని డీడీ రీజినల్ న్యూస్ యూనిట్ హెడ్ షఫి మొహమ్మద్ తెలిపారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం ద్వారా యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఇండియన్ బ్యాంకు మేనేజర్ విజయేంద్ర సూచించారు. ప్రిన్సిపాల్ రవి కడియాల, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో అసిస్టెంటు ఉపేంద్ర గౌడ్, ఎల్ఐసీ డీవో కొల్లా వెంకటనారాయణ పాల్గొన్నారు.

కేంద్రమంత్రి దృష్టికి మధురానగర్ ఆర్‌వోబీ

● సానుకూలంగా స్పందించారన్న ఎంపీ చిన్ని



మధురానగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ - వాంబే కాలనీ మధ్య ఆర్‌వోబీ నిర్మాణం అంశం కేంద్రం మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఇదే విషయమ్మై ఢిల్లీలో కలిసి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యను తెలియజేయడంతో ఆయన అనుకూలతను చెప్పారన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని మధురానగర్, వాంబేకాలనీ మధ్య రెండు లైన్ల అండర్ బ్రిడ్జిని పూర్తిగా రైల్వే నిధులతో నిర్మించేందుకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరానన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ అభ్యర్థనపై కేంద్రమంత్రి స్పందించడమే కాకుండా రైల్వే అధికారులకు మధురానగర్, వాంబే కాలనీ మధ్య టూ లైన్ ఆర్‌వోబీ నిర్మాణంపై నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.



జస్టిస్ తుహిన్‌కుమార్‌తో బాచిన హనుమంతరావు, చల్ల ధనుంజయ

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన బాచిన, చల్ల

పెనమలూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు సీనియర్ నాయవాది బాచిన హనుమంతరావు, భారత అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) చల్ల ధనుంజయలు నూతనంగా నియమితులైన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుహిన్‌కుమార్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. బందరు రోడ్డులోని న్యాయమూర్తి నివాసంలో ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలపై పిడుగుపాటు

● ధ్వంసమైన పిట్టగోడ, తప్పిన ప్రమాదం



పిడుగుపాటుకు ధ్వంసమైన కళాశాల పిట్టగోడ

మైలవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతోపాటు అక్కడక్కడ పిడుగులు పడ్డాయి. లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనంపై పిడుగుపడటంతో కళాశాల పిట్టగోడ స్వల్పంగా ధ్వంసమైంది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. గతంలోనూ కళాశాలపై పిడుగుపడి కార్యాలయం అగ్నిప్రమాదానికి గురై సుమారు రూ.15లక్షలు వరకు నష్టం వాటిల్లినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఊరు వెలుపల ఆరుబయట ప్రాంతంలో కళాశాల ఉండటంతో ప్రకృతి వైపరీత్యాలు వస్తున్నప్పుడు ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

దళితులను దగా చేసిన వైసీపీ ప్రభుత్వం

● ఆర్టీసీలో అద్దె బస్సుల యజమానులు

ధర్నాచౌక్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం తమకు సబ్సీడీలు విడుదల చేయకుండా తీరని అన్యాయం చేసిందని ఎంఎస్ఎంఈ సబ్సీడీ పథకం ద్వారా ఆర్టీసీలో అద్దె బస్సులు నడుపుతున్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ యాజమానులు మండిపడ్డారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. ఈఎంఐలు, డ్రైవర్లు, క్లీనర్లకు జీతాలివ్వలేని స్థితికి వచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు. లాభం లేని రూట్‌లను అప్పగించడం వల్ల బస్సుకు సుమారు రూ.50వేల నష్టాన్ని భరించామన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నుంచి సబ్సీడీలు విడుదల చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి మేళం భాగ్యరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ న్యాయం చేయాలన్నారు. ఆర్టీసీ అద్దెబస్సుల యాజమానుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈరి రాజశేఖర్, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి మేడిద బాబురావు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కేదారేశ్వరపేట ప్రాంతంలో గురువారం జరిగింది. అనుకున్నదానికన్నా తక్కువ మార్కులు రావడంతో మనస్తాపానికి గురైన యువకుడు బలవన్మరణానికి పాల్పడినట్టు తెలుస్తుంది. కేదారేశ్వరపేటకు చెందిన యువకుడు (17) ఎంజీ రోడ్డులోని కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. ఇటీవల కళాశాలలో జరిగిన వీక్లీ టెస్ట్‌లో అనుకున్నదాని కన్నా తక్కువ మార్కులు రావడంపై తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. బాగా చదివే విద్యార్థి అయినా తక్కువ మార్కులు రావడంతో కళాశాల యాజమాన్యం సెక్షన్ మార్చినట్టు తెలుస్తోంది. దీంతో ఇంట్లో కుటుంబ సభ్యులు లేని సమయంలో ఫ్యానుకు చున్నీతో విద్యార్థి ఉరేసుకుని మృతి చెందాడు. సమాచారం అందుకున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో ప్రిలిమినరీ టెన్టిటివ్ ప్రియార్టీ లిస్ట్

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి: రాష్ట్ర స్పోర్ట్స్ మెగా డీఎస్సీ-2025 నోటిఫికేషన్‌కు సంబంధించిన 3శాతం హారిజంటల్ స్పోర్ట్స్ రిజర్వేషన్ కింద 421 ఉపాధ్యాయ ఉద్యోగుల భర్తీకి ప్రిలిమినరీ టెన్టిటివ్ ప్రియారిటీ లిస్ట్‌ను https://sportsdsc.apcfss.in/, నందు విడుదల చేసినట్టు శాప్ ఎండీ అజయ్ జైన్ తెలిపారు. అభ్యర్థులు జాబితాను చూసుకోవాలని, అభ్యంతరాలుంటే ఆగస్టు 13న అర్థరాత్రి 12 గంటల వరకు వెబ్‌సైట్‌లో తెలియజేయాలని కోరారు.

బకాయిలను వెంటనే విడుదల చేయాలి

● రాష్ట్ర రిటైర్డ్ ఎంప్లాయిస్ కన్వీనర్ డాక్టర్ తారకప్రసాద్

విజయవాడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రిటైరైన ప్రభుత్వ ఉద్యోగులకు రావల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కన్వీనర్ డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం రిటైర్డ్ ఉద్యోగులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రిటైర్ అయి ఏడాదైనా ఇంతవరకు గ్రాట్యుటీ ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ జీపీఎఫ్ రాకపోవడంతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే ఉద్యోగులకు రావల్సిన బకాయిలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పీఆర్‌సీని నియమించి ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లోని డీఏలను విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలని తారక ప్రసాద్ కోరారు.

హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేత

మచిలీపట్నం క్రైమ్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): హోంగార్డ్స్ ఒక రోజు వేతనం నుంచి సేకరించిన రూ.3,79,140 చెక్కును ఓఎన్‌జీసీ బంటుమిల్లిలో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మృతి చెందిన హోంగార్డు ఎల్ రవిబాబు సతీమణి రజిని దేవికి జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు గురువారం అందజేశారు.



శ్రావణ శోభ

వరలక్ష్మీ వ్రతం సందర్భంగా వన్‌టౌన్‌లోని కాళేశ్వరరావు మార్కెట్, నగర పాలక సంస్థ పక్కన ఉన్న పూల మార్కెట్ కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయింది. దేవతారాధనకు అవసరమైన పండ్లు, పూలు, జలంతోపాటు నైవేద్యానికి పొంగలి వంటి తీపి పదార్థాల తయారీకి అవసరమైన వస్తువులు కొనుగోలు చేసేందుకు భక్తులు బారులు తీరారు. దీంతో ఆయా రోడ్లు రద్దీగా మారాయి. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

● మాతాశిశు మరణాలు నమోదు కాకుండా విధులు నిర్వర్తించాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, హాజరైన జిల్లాస్థాయి అధికారులు

కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మతాశిశు మరణాలు సంభవించకుండా ఆశా కార్యకర్త నుంచి వైద్యాధికారి వరకు ప్రతి ఒక్కరూ నిబద్ధత, క్రమశిక్షణతో సేవలందించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాతృ, శిశు మరణాల పర్యవేక్షణ, ప్రతిస్పందన కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో నమోదైన రెండు మాతృ, ఐదు శిశు మరణాలపై వైద్యారోగ్యశాఖ, వైద్యాధికారులు, స్పెషలిస్టు వైద్యులు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్షించారు. మరణాలకు కారణాలను విశ్లేషించడంతో పాటు కుటుంబ సభ్యుల నుంచి అభిప్రాయాలు తీసుకొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రతి ప్రాణమూ విలువైనది, చిన్న చిన్న జాగ్రత్తలే వారి ప్రాణాలకు రక్షణగా నిలుస్తాయన్నారు. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి అన్ని వైద్య పరీక్షలు చేయించుకొనేలా అవగాహన కల్పించాలన్నారు. రిజిస్ట్రేషన్ దగ్గరి నుంచి గర్భిణుల ఆరోగ్యం వివరాలను సక్రమంగా నమోదు చేయాలని, హైరిస్క్ ఉన్న గర్భిణులపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలు, విధానాల అమల్లోనూ ఎవరైనా నిర్లక్ష్యం వహించినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జే ఇందుమతిదేవి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమం, సాధికారత అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం, వైద్య నిపుణులు, జీజీహెచ్ వైద్యాధికారులు పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్యం.. కీలక ప్రగతి సూచిక

వ్యవసాయ, ఉద్యానవన పంటల సాగులో సాగునీటి యాజమాన్యం చాలా ప్రధానమైందని, సాగునీటి వనరుల సద్వినియోగంలో భాగంగా బిందుసేద్యం, తుంపర సేద్యంపై రైతులకు అవగాహన పెంచాలని, జిల్లాలో 2024-25 వరకు 23,937 హెక్టార్లు సూక్ష్మ సేద్యం కింద ఉందని, 2025-26లో కొత్తగా 2,200 హెక్టార్లను ఈ విధానంలోకి తీసుకొచ్చేలా అధికారులు కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏపీ మైక్రో ఇరిగేషన్ పథకం (ఎంఐపీ) కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇగ్నైట్ సెల్‌ను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. సూక్ష్మ సేద్యంపై అవగాహన పెంచేందుకు రూపొందించిన కరపత్రాలను, డ్రిప్, స్ప్రింకర్, రైనగన్‌లకు సంబంధించిన పరికరాలను పరిశీలించారు. ఉపాధి హామీ పథకం సహాయంతో ఈ ఏడాది 4వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు వేయడం జరుగుతోందని, ఆయా రైతులను సూక్ష్మ సేద్యం దిశగా ప్రోత్సహించాలని కలెక్టర్ లక్ష్మీశ, ఎంఐపీ అధికారులకు సూచించారు. ఆయన వెంట ఏపీ ఎంఐపీ పీడీ పీఎం సుభాని, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

వయోవృద్ధుల సంరక్షణను విస్మరిస్తే చర్యలు

వయోవృద్ధుల సంరక్షణ బాధ్యతపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టం-2007, తల్లిదండ్రుల, వయోవృద్ధుల పోషణ, సంరక్షణ నియమావళి 2011పై జిల్లాస్థాయి అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు తమ తల్లిదండ్రులను, పోషణను చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. వయోవృద్ధులకు చట్టం కల్పించిన హక్కులను వారికి అందేలా జిల్లా అధికారులు కృషి చేయాలన్నారు. సెక్షన్ 23 ప్రకారం తల్లిదండ్రులు ఇచ్చిన ఆస్తిని తిరిగి తీసుకోవచ్చు. సెక్షన్ 24 ప్రకారం తల్లిదండ్రుల సంరక్షణను నిర్లక్ష్యం చేస్తే 3 నెలల శిక్ష, రూ.5 వేల జరిమానా విధించబడుతుందన్నారు. ముందుగా హెరిటేజ్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ హెడ్ టీ రవి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చట్టంపై అధికారులకు అవగాహన కల్పించారు. ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ వీ కామరాజు, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, మున్సిపల్ కమిషనర్లు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



గవర్నర్‌పేట 2 డిపో వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ స్థలాల పరిరక్షణ కమిటీ నాయకులు

ప్రజా ఉద్యమాలతోనే ఆర్టీసీ స్థలాల పరిరక్షణ

● ఆర్టీసీ స్థలాల పరిరక్షణ కమిటీ నేతలు

బస్టేషన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఉద్యమాలతోనే ఆర్టీసీ స్థలాలను కాపాడుకుంటామని ఆర్టీసీ స్థలాల పరిరక్షణ కమిటీ నేతలు అన్నారు. ఆర్టీసీ గవర్నర్‌పేట -2 డిపో స్థలాన్ని లులు సంస్థకు కట్టబెట్టిన జీవో 137ను వ్యతిరేకిస్తూ గురువారం గవర్నర్‌పేట-2 డిపో వద్ద కమిటీ కన్వీనర్, ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. హాజరైన రైతు సంఘాల సమైఖ్య సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ లులుకు కేరళలో రెండు, దేశవ్యాప్తంగా 13 మాల్స్ ఉంటే ఎక్కడా ఎకరా స్థలం ఇవ్వలేదన్నారు. విశాఖ బీచ్ రోడ్డులో 13 ఎకరాలు, విజయవాడలో 4 ఎకరాల 17 సెంట్లు ఇవ్వటానికి చంద్రబాబుకు చేతులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఆర్టీసీ స్థలాల పరిరక్షణ కమిటీ కన్వీనర్ సుంకర రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సామాజిక సంపదను ఎవరు దోపిడీ చేసినా, కొల్లగొట్టినా చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చిగురుపాటి బాబూరావు మాట్లాడుతూ నగర, రాష్ట్ర ప్రజలందరూ ఏకమై విశాఖ బీచ్ స్థలం, విజయవాడలో ఆర్టీసీ స్థలాన్ని కాపాడుకోవటానికి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 137ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డీ కాశీనాథ్, సీపీఐ నగర కార్యదర్శి జీ కోటేశ్వరరావు, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎస్‌కే జిలానీ బాషా, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ విజయవాడ జోన్ కార్యదర్శి వైఎస్ రావు, జేవీవీ నేత వీ లక్ష్మణ్ రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, ఐఎఫ్‌టీయూ నేత పోలారి, సీపీఐ (ఎంఎల్) నేత చిట్టిపాటి వెంకటేశ్వరరావు, ఆర్టీసీ పెన్షనర్స్ అసోసియేషన్ నేత మురహరి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, కార్పొరేటర్ బోయ సత్యబాబు, సీఐటీయూ నేతలు పీ కృష్ణ, కే దుర్గారావు, ఏఐటీయూసీ నేతలు లంకా దుర్గారావు, మూలే సాంబశివరావు, ఎస్‌డబ్ల్యుఎఫ్, ఎంప్లాయిస్ యూనియన్ నేతలతో పాటు ఆర్టీసీ కార్మికులు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను తక్షణం క్రమబద్ధీకరించాలి

● యూనియన్ అధ్యక్షుడు రాజశేఖర్

గుణదల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను తక్షణమే క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జల్లెడ రాజశేఖర్ డిమాండ్ చేశారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రం నలుమూలల నుంచి కాంట్రాక్టు కార్మికులు పెద్ద సంఖ్యలో విజయవాడ గుణదలలోని విద్యుత్‌సౌధ ముట్టడి గురువారం తలపెట్టారు. ఈ నేపథ్యంలో సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ ఆధ్వర్యంలో పోలీసులు రామవరప్పాడు రింగ్ నుంచి అటు గుణదల సెంటర్ వైపు నుంచి ఎవరూ ముట్టడికి రాకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడే కార్మికులను అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. బస్టాండ్ రైల్వేస్టేషన్ వద్ద కాంట్రాక్టు కార్మికులను గుర్తించి అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పోలీసుల కళ్లుగప్పి గుణదల విద్యుత్‌సౌధ వద్దకు చేరుకున్న వారిని కార్యాలయం వద్దకు వెళ్లనీయకుండానే స్కూల్ బస్సులు వ్యానుల్లో ఎక్కించి స్టేషన్‌కు తరలించడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. కార్మికుల సమస్యలను చెప్పుకోవడానికి కూడా వీల్లేదా మా నోళ్లు మూపిస్తారా అంటూ యూనియన్ నేతలు ఆందోళనకు దిగారు. 2022 పీఆర్సీ బకాయిలు, పెయిడ్ హాలీడేస్ బకాయిలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ నేతలు ముజఫర్ అహ్మద్, పీవీ నాగేశ్వరరావు, డీ సూరిబాబు పాల్గొన్నారు.

ఏలూరు రోడ్డులో ఉద్రిక్త వాతావరణ

భారతీనగర్: గురువారం ఉదయం విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు గుణదలలోని విద్యుత్ సౌధ కార్యాలయాన్ని ముట్టడించడానికి ప్రయత్నించడంతో సమాచారం అందుకున్న పోలీస్ శాఖ అధికారులు ఏలూరు రోడ్డు, రామవరప్పాడు రింగ్ సెంటర్ నుంచి పడవల రేవు సెంటర్ వరకు భారీ బందో బస్తు ఏర్పాటు చేశారు. ఈ సంఘటనలో పలువురు కార్మికులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఈ ప్రాంతమంతా ఉద్రిక్త వాతావరణ నెలకొంది.



గుణదలలోని విద్యుత్ సౌధ వద్ద విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగరాదు

● అధికారులతో కలిసి దసరా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ లక్ష్మీశ



ఇంద్రకీలాద్రి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దసరా మహోత్సవాల సందర్భంగా దుర్గమ్మ దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, మౌలిక సదుపాయాల కల్పనలో లోపం ఉండరాదని ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ ధికారులకు సూచించారు. గురువారం ఆయన ఈవో శీనానాయక్, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందితో కలిసి దుర్గగుడిలో జరుగుతున్న దసరా ఏర్పాట్లను పరిశీలించారు. దుర్గాఘాట్, జాతీయ రహదారి ప్రాంతం, కనకదుర్గానగర్ ప్రాంతం, మహామండపం ప్రాంతాలను పరిశీలించారు. ప్రసాదాల క్యూలను గమనించి ప్రసాదాల నాణ్యతపై ఆరా తీశారు. పరిశుభ్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రసాదాల కౌంటర్‌లో భక్తులకు విక్రయిస్తున్న కవర్లను పరిశీలించి బయోడిగ్రేడబుల్ కవర్లను అందజేస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. భక్తుల రద్దీని పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని, పటిష్ఠ భద్రతా ఏర్పాట్లను చేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, ఆలయ పరిసరాలు, క్యూలైన్లలో పరిస్థితులు, ప్రసాద పంపిణీ వంటి వాటిని పరిశీలించిన ఆయన పలు సూచనలను చేశారు. భక్తులకు ఎలాంటి అనారోగ్య ఇబ్బందులు వచ్చినా పరిశీలించేందుకు ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, తగినంత వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పనులను మరింత వేగవంతం చేయాలన్నారు.



బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 490	

బాధితులకు న్యాయం చేస్తా : గీతాంజలి శర్మ

గుడివాడ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గుడివాడ - పామర్రు ఫైఓవర్‌లో భాగంగా నష్టపోయిన వారికి న్యాయం జరుగుతుందని ఇంచార్జ్ కలెక్టర్ గీతాంజలి శర్మ అన్నారు. గురువారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో రోడ్డు విస్తరణలో భాగంగా నష్టపోయిన వారికి ఏ విధంగా నష్టపరిహారం చెల్లించాలో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గీతాంజలి శర్మ



అడపా బాబీకి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే రాము

రైతుల సంక్షేమమే ధ్యేయం

గుడ్లవల్లేరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అండగా ఉంటూ పదవులకు వన్నె తీసుకురావాలని వడ్లమన్నాడు పీఏసీఎస్‌కి నియమితులైన త్రిమన్ కమిటీ సభ్యులతో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. వడ్లమన్నాడు సొసైటీ త్రిమన్ కమిటీ ఛైర్మన్ అడపా వి.వి.ఎస్. చంద్రశేఖరబాబు(జనసేన) , సభ్యులుగా అబ్దుల్ జమీర్ (టిడిపి), మండా మురళీనాంచారయ్య(టిడిపి) లు గురువారం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రామును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని అభినందిస్తూ రైతులకు అందుబాటులో ఉంటూ వారికి అండగా నిలవాలని సూచించారు. అనంతరం కేక్‌ను కట్‌చేసి తినిపించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పామర్తి సత్తిబాబు, మన్నెం నరసింహారావు, పామర్తి కన్నెభాస్కరరావు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు తోట చిన్నారి, చిలంకుర్తి వెంకటేష్, పాల్గొన్నారు.



కాజాలో నినాదాలు చేస్తున్న చేనేత కార్మిక నేతలు

ఘనంగా చేనేత కార్మిక దినోత్సవం

కూచిపూడి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత కార్మిక దినోత్సవాన్ని కాజలో గురువారం ఘనంగా నిర్వహించారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తూ ప్రదర్శనగా తరలి వెళ్లి ప్రధాన సెంటర్‌లోని మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్.అంబేద్కర్, డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. చేనేత కార్మిక సంఘ నేతలు కోదాటి నారాయణరావు, సీహెచ్.సత్యనారాయణ, నందం శ్రీనివాసరావు, కోదాటి సుధాకర్, కనక దుర్గారావు, ఈశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..!

- చేతికందేంత ఎత్తులో విద్యుత్ తీగలు
- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - కూచిపూడి): గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై ప్రజలు ఆందోళన చెందుతున్నా, ప్రజా సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్నా, మండల పరిషత్ సమావేశాల్లో తరచూ అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీస్తున్నా ఇవేమీ పట్టనట్టు విద్యుత్‌శాఖ అధికారులు వ్యవహరించటం విమర్శలకు తావిస్తోంది. మండల పరిధిలోని కోసూరు గ్రామంలో బీసీ కాలనీలో సబ్ స్టేషన్‌కు ఎదురుగా కిందికి వేలాడుతున్న వైర్లు, నిడుమోలులో విద్యుత్ స్తంభం విరిగిపోయి కూలటానికి సిద్ధంగా ఉంది. పెదనసగల్లు ఎస్సీ కాలనీలో ఇంటిపై నుంచి చేతికందేటట్లు వేలాడుతున్న హైటెన్షన్ వైర్లు ఇలాంటి సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. నిడుమోలు జాతీయ రహదారిపై రెండు నెలలుగా విద్యుత్ లైట్లు వెలగకపోవటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులకు చీమకుట్టినట్లైనా లేదని విద్యుత్ శాఖ అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కోసూరులో ఇంటిపై వేలాడుతున్న హై టెన్షన్ వైర్లు



నిడుమోలులో దెబ్బతిన్న స్తంభాన్ని చూపుతున్న గ్రామస్థులు

సమస్యను పరిష్కరించాలి



చేతికందేంత ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్లతో నిత్యం ప్రజలు భయాందోళనకు గురవు తున్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయకపోతే ప్రజల పక్షాన పోరాడతా.

శీలం నారాయణరావు, సీపీఎం మొవ్వ కార్యదర్శి

అధికారులు పట్టించుకోవడం లేదు

కూచిపూడి కాలనీలో వీధిలైట్లు వెలగకపోవటంతో అంధకారంలో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నాం. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ప్రయోజనం లేదు.

ఫణికుమార్, కూచిపూడి కాలనీ వాసి

వీలైనంత త్వరలో సమస్యను పరిష్కరిస్తాం

విద్యుత్ సమస్యలు తమ దృష్టికి వచ్చాయి. రెండు మూడు రోజుల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

శ్రీహరి , లైన్ ఇన్‌స్పెక్టర్

మల్లాయిపాలెం రైల్వేగేటు మూసివేత

గుడివాడ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మల్లాయిపాలెం రైల్వే గేటును ఈనెల 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు 15రోజులపాటు మూసివేస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు గురువారం రైల్వేగేటు వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. కనీసం వారంరోజులు ముందుగా సమాచారం అందిస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండేవి కాదని, ఒక్కరోజు ముందు ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



రైల్వేగేటును మూసివేస్తున్నట్లు ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీ

ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తా

● అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ పి.వెంకటరమణ

గుడివాడ : అగ్నిమాపక శాఖ రాష్ట్ర నూతన డైరెక్టర్ జనరల్‌గా పి.వెంకటరమణకు గుడివాడ అగ్నిమాపక శాఖ ఉద్యోగి, రాష్ట్ర ఫైర్ సర్వీసెస్ మాజీ కోశాధికారి వై.ఎల్ కుమార్ గురువారం విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో అభినందనలు తెలిపారు. వెంకటరమణ బాధ్యతలు చేపట్టడం అగ్నిమాపక శాఖ అభివృద్ధికే కాక, ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తారని కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

పేదల పెన్నిధి .. సీఎం సహాయనిధి

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో అపదలో ఉన్నవారికి పార్టీలకు అతీతంగా ఆర్థిక తోడ్పాటు అందిస్తున్న కూటమి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. చాగంటిపాడుకు చెందిన వైసీపీ క్రియాశీలక కార్యకర్త మర్రెడ్డి వెంకటరెడ్డి బార్య ధనలక్ష్మికి ఆరోగ్య చికిత్స పొందడం కోసం సీఎం సహాయ నిధినుంచి మంజూరైన రూ. 69,800 నగదు చెక్కును గురువారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే చేతులమీదుగా అందించారు.

చాట్లవానిపురానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని చాట్ల శివనాగేశ్వరి విద్యకు అవసరమైన రూ. 6500లను కొత్తూరు శ్రీనివాస్ వితరణతో ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా తనచేతులమీదగా విద్యార్థికి అందజేశారు.

పమిడిముక్కల: వీరంకిలాకుకు చెందిన శంఖాబత్తుల కస్తూరికి రూ. 52,284, ఐనపూరు కు చెందిన దూడల రమణకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కు లు గురువారం వారి నివాసగృహాల వద్ద ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేని పేద వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం అందచేస్తూ సహాయ పడుతున్నారన్నారు.



వెంకటరెడ్డికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులు

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనుల్లో గుడివాడ నియోజకవర్గ మరింత దూసుకుపోతుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గురువారం స్థానిక 2,3 వార్డుల్లో రూ.4కోట్ల ప్రత్యేక నిధులతో నిర్మించనున్న రహదారులు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో కుప్పం తరువాత అంతటి పాధాన్యత గుడివాడకు ఇస్తూ రూ.10కోట్లు ప్రత్యేక నిధులను సీఎం చంద్రబాబు మంజూరు చేశారన్నారు. ఎప్పుడూ రోడ్డు ముఖం చూడని ధనియాలపేట, న్యూ ఇందిరానగర్ కాలనీ, వాంబే కాలనీల్లో రూ.6కోట్లతో రహదారులు, డ్రెయిన్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఆర్‌డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నాగరాజు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ పిన్నమనేని బాబ్జీ, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, నాయకులు సత్యనారాయణ, ప్రసాద్, పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● డీఎస్పీ ధీరజ్ వినీల్

గుడివాడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : వాహనాలను అక్రమ రవాణ కార్యకలాపాలకు వినియోగించరాదని, మద్యం, మత్తు పదార్థాల వినియోగం వద్దని, సురక్షిత డ్రైవింగ్ పాటించాలని డీఎస్పీ ధీరజ్ వినీల్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆటోనగర్‌లో ది లారీ ఓనర్స్ అండ్ ట్రాన్స్‌పోర్టు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లారీ ఓనర్లు, డ్రైవర్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన డీఎస్పీ మాట్లాడుతూ వాణిజ్య వాహనాల చట్టబద్ద వినియోగం, భద్రతా ప్రమాణాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వాహనాలకు రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, లైసెన్స్, పర్మిట్, పొల్యూషన్, బీమా వంటి డాక్యుమెంట్‌లను తప్పనిసరి అని పేర్కొన్నారు. వాహనాల్లో జీపీఎస్, రిఫ్లెక్టర్లు, బుకింగ్ వివరాలు, డ్రైవర్ ఐడీ తప్పనిసరిగా ఉండాలన్నారు. అనుమానాస్పద చట్టవిరుద్ధ కార్యకలాపాలను పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో టూటౌన్ సీఐ హనీష్, రూరల్ సీఐ సోమేశ్వరరావు, రూరల్ ఎస్సై చంటిబాబు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అడుసుమిల్లి శ్రీనివాస్, సంఘ సభ్యులు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

● కె.రామ సుబ్బారెడ్డి

గుడ్లవల్లేరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): శరీరం దృ ఢంగా ఉండాలంటే మంచి ఆహార అలవాట్లు, వ్యా యామం, క్రమశిక్షణ, సమయపాలన వంటివి విద్యార్థులు తప్పనిసరిగా అలవర్చుకోవాలని కడప యోగివేమన విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డ్ ఛైర్మన్ డాక్టర్ కె.రామ సుబ్బారెడ్డి అన్నారు. గురువారం శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల(ఎస్.ఆర్.జీ.ఈ.సి) మొదటి సంవత్సరం విద్యార్థులకు జీరో సెమిస్టర్ లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో రామసుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థినీ,విద్యార్థులకు వ్యాయామం ఎంత అవసరమో వ్యాయామ సూత్రాలను ఆయన వివరించారు. విద్యార్థులు విద్యతోపాటు ప్రతి ఒక్కరూ ఏదో ఒక ఆట ఆడాలని తద్వారా శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉత్తేజానికి అది దోహదపడుతుందని ఆయన చెప్పారు. అనంతరం రామసుబ్బారెడ్డిని సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణకుమార్, యాజమాన్య సలహాదారు డాక్టర్ పొట్లూరి రవీంద్రబాబు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కోదండ రామారావు, డాక్టర్ ఎం.ఆర్.సిహెచ్ శాస్త్రి, ప్రసాద్, వి.నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రామసుబ్బారెడ్డిని సన్మానిస్తున్న కరుణ కుమార్

ఎంఈవో-1గా రజని బాధ్యతల స్వీకరణ

గుడివాడ రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గుడివాడ మండల ఎంఈవో-1 చింతల చెరువు రజని బాధ్యతలు స్వీకరించారు. మచిలీపట్నం రాంజీ హైస్కూల్ నుంచి సీనియర్ టీచర్‌గా పని చేస్తూ గుడివాడ ఎంఈవో-1గా బాధ్యతలు స్వీకరించారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

గుడివాడ : స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన అండర్-22 రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ సెలక్షన్స్‌లో జిల్లా వాలీబాల్ జట్టుకు స్థానిక మాంటిస్సోరి ఇంగ్లీష మీడియం విద్యార్థులు బాలుర విభాగంలో ఎస్.బెనర్జీ, ఎ.శివ, మొదటి స్టాండ్‌బైగా జి.రాకేష్‌లు, బాలికల విభాగంలో యమ్.జైబున్నీసాలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జి.పద్మావతి పేర్కొన్నారు. జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుడివాడ : రాష్ట్ర క్రీడా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-22 రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ సెలక్షన్ పోటీలకు డాక్టర్ కేకేఆర్ గౌతమ్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక కొత్త బైపాస్‌రోడ్డులోని పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఎ.జనవిక రక్ష, ఎన్.తేజస్విని, బి.గుణవర్షిణి(స్టాండ్‌బై), డి.ఆరాధ్య, కె.నిష్టలను ఆయన అభినందించారు. ఎంపికైన విద్యార్థులను, కోచ్ మడకా సత్యాన్వేష్‌లను పాఠశాల ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

గుడివాడ : స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడా సాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం వివిధ విభాగాల్లో జిల్లా జట్ల ఎంపిక నిర్వహించారు. ఈ నెల 11నుంచి 14వ తేదీ వరకు గుంటూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, బాస్కెట్ బాల్ జిల్లా జట్లను ఎంపిక చేశారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులను స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, అభినందించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుదర్శన హోమం

పమిడిముక్కల : మంటాడ అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం శ్రావణమాస శ్రవణానక్షత్రం పురస్కరించుకుని ఉదయం 7 గంటలకు సుదర్శన హోమం వైభవంగా నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి సీహెచ్ హరిదుర్గా నాగేశ్వరరావు తెలిపారు. హోమంలో పాల్గొన దలచిన భక్తులు ముందుగా పేర్లు నమోదుచేసుకోవాలని పేర్కొన్నారు.

కార్పొరేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు మెండు

● డాక్టర్ రాజశేఖర్

గుడివాడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ రంగంలో అనేక ఉపాధి, ఉద్యోగ అవకాశాలను ఉన్నాయని, ప్రభుత్వ ఉద్యోగంతో పోలిస్తే కార్పొరేట్ రంగంలో ఉద్యోగాలకు ఎన్నో ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయని ఫెలో మెంబర్ ఆఫ్ కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంట్స్, కలకత్తా, అధ్యాపకులు డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఏఎన్ఆర్ కళాశాలలో కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్, డిపార్టుమెంట్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ వారి ఆధ్వర్యంలో కార్పొరేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ఆర్‌కె ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ సువర్చల, పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రాజశేఖర్

వీకేఆర్ అండ్ వీఎన్‌బీలో క్యాంపస్ ఎంపికలు



నియామక పత్రాలను అందుకున్న విద్యార్థులు

గుడివాడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కళాశాలలో ఫైతాక్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ గురువారం కళాశాలలో బీటెక్ ఆఖరి సంవత్సర విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. విద్యార్థులకు వ్రాతపరీక్ష, ఇంటర్వ్యూలను నిర్వహించారు. మొత్తం 145 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కంప్యూటర్ విభాగం నుంచి 8మంది, ఎలక్ట్రానిక్స్ నుంచి ఒకరు, ఆర్టిఫియల్ ఇంటలిజెన్స్ విభాగం నుంచి ఒకరు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.హెచ్.వి ప్రసాదరావు తెలిపారు. రూ.4లక్షల వార్షిక జీతంగా కంపెనీల మేనేజర్లు నియామకపత్రాలను అందజేశారు. నియామకం పొందిన విద్యార్థులను కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య, అకడమిక్ డైరెక్టర్ బి.కళ్యాణ్‌బాబు, ప్లేస్‌మెంట్ అధికారి ఎస్.నవీన్, ట్రైనింగ్ అధికారి ఎన్.ధనుంజయరావు, విభాగాధిపతులు, పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

మొక్కలు నాటే కార్యక్రమం

తోట్లవల్లూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ కోసం చాగంటిపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యాక్రమాలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులకు రోటరీ కంటి ఆస్పత్రి వైద్యులచే కంటి పరీక్షలు నిర్వహించారు. మర్రెడ్డి ప్రసాదరెడ్డి ఆర్థిక సహాయంతో రూ.15 వేలు విలువ గల వాటర్ ప్యూరిఫైర్ మిషన్‌ను పాఠశాలకు అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చొప్పరపు నాగ సుబ్రహ్మణ్యం, రోటరీ కార్యదర్శి అమీర్ మీర్జా, కేసీపీ మేనేజర్ కోటిరెడ్డి, మర్రెడ్డి బసివిరెడ్డి, విద్యా కమిటీ ఛైర్మన్ బి.ఉమామహేశ్వరరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేతన్నలకు కూటమి అండ

తోట్లవల్లూరు : చేనేత కుటుంబాలు ఆర్థికంగా ముందడుగు వేసేందుకు సీఎం నారా చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయాలు అద్భుతమని రాష్ట్ర గౌడ కార్పోరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు, మగ్గాలకు 500 యూనిట్లు ఉచిత కరెంటు, ఏడాదికి రూ 25 వేలు సహాయం, 50 ఏళ్ళకే పించన్ ఇవ్వటం లాంటి నిర్ణయాలు చేనేతన్నల తలరాతను మార్చేందుకు దోహద పడతాయని వివరించారు.

మళ్లీ పెరిగిన వరద

తోట్లవల్లూరు : మండలంలోని కృష్ణానదీపాయలకు గురువారం వరద ప్రవాహం పెరిగింది. బుధవారం వరకు తగ్గిన వరదతో తాత్కాలిక రహదారులు బయట పడ్డాయి. వరద తగ్గితే లంకల రాకపోకలకు ఇబ్బంది ఉండదని రైతులు భావించగా మళ్ళీ వరద పెరగటంతో పడవలపై ప్రయాణించాల్సి వచ్చిందంటున్నారు. అలాగే అరటి, కూరగాయ పంటలను మార్కెట్‌కు చేరవేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు తెలిపారు.

తల్లిపాలే బిడ్డకు అమృతం

పెదపారుపూడి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం గురువారంతో ముగిసింది. మండల కేంద్రమైన పెదపారుపూడి-3, వెంట్రప్రగడ అంగన్వాడీ కేంద్రం-3 లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మసిముక్కు శివనాగమణి, అరుణ కుమారి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. పల్లవి, అంగన్వాడీ టీచర్లు భవాని, రజని, సుశీల, పాల్గొన్నారు.

గుడివాడ : స్థానిక 16వవార్డులో అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సీడీపీవో విజయఫ్లొరెన్స్, తెలుగు మహిళ పట్టణ అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణిలు పాల్గొని తల్లిపాల విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు సూపర్‌వైజర్లు దుర్గభవాని, రాధిక, పార్వతీ, అంగన్వాడీ టీచర్లు సి.హెచ్ పద్మావతి, కె.నాగమణి, రావమ్మ, పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : యాకమూరు అంగన్వాడీ కేంద్రం-1లో గురువారం తల్లిపాల వారోత్సవాలలో భాగంగా తల్లులు, గర్బవతులకు తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త టి మరియమ్మ పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

లైసెన్స్ లేని నాటు తుపాకులు, ఆయుధాలు కలిగి ఉంటే చర్యలు : ఎస్పీ

మచిలీపట్నం క్రైమ్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : లైసెన్స్ లేని నాటు తుపాకులు, ఆయుధాలను కలిగి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఆర్.గంగాధరరావు హెచ్చరించారు. తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనుమతులు లేని ఆయుధాలు, నాటు తుపాకులను కలిగి ఉన్నా, వినియోగించినా చట్టప్రకారం కఠిన చర్యలుంటాయన్నారు. జంతువులను వేటాడేందుకు, తోటి వారిని బెదిరించే ఉద్దేశ్యంతో నాటు తుపాకుల కలిగి ఉంటే మూడు సంవత్సరాల జైలు శిక్ష తప్పదన్నారు. వీటికి సంబంధించి ఎటువంటి సమాచారమున్నా సెల్ నెం. 94407 96400కు సమాచారం అందించాలన్నారు.



మాజీ హోం మంత్రి చినరాజప్ప, జగిత్యాల కలెక్టర్ బి.సత్యప్రసాద్‌లకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈవో

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో ప్రముఖులు

మోపిదేవి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని మాజీ హోం శాఖ మంత్రి నిమ్మకాయల చిన రాజప్ప గురువారం దర్శించుకున్నారు. చిన రాజప్పకు ఆలయ ఈవో దాసరి శ్రీరామవర ప్రసాదరావు, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలు పోసి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. అర్చకులు పూజలు నిర్వహించి మర్యాదలతో ఘనంగా సత్కరించి, ప్రసాదాలను, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని జగిత్యాల కలెక్టర్ బి.సత్యప్రసాద్ దంపతులు గురువారం దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఘనంగా సత్కరించి ప్రసాదాలను, శ్రీ స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.



గూడూరులో జిల్లా హాకీ జట్ల ఎంపిక

గూడూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయిలో హాకీ క్రీడాకారుల ఎంపిక గూడూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. గూడూరు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జి.విజయకుమారి ఎంపికను పర్యవేక్షించారు. హాకీ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఎస్.రామకృష్ణ, జిల్లా జనరల్ సెక్రటరీ శ్రవణం హరికృష్ణ, జాయింట్ సెక్రటరీ యోగానంద, ట్రెజరర్ విఠల్, గూడూరు ఆర్ఆర్ క్లబ్ సెక్రటరీ పెనుగొండ శ్రీనివాసరావు, హైస్కూల్ పీడీ అరుణ, పీఈటీ రాజేష్ జిల్లా పురుషులు, స్త్రీల హాకీ జట్టు క్రీడాకారులను ఎంపిక చేశారు.



లక్ష్మణస్వామికి అగ్నికుల క్షత్రియుల నివాళి

అవనిగడ్డ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో అగ్నికుల క్షత్రియ జాతిపిత పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ 156వ జయంతి వేడుకలు నాల్గో వార్డులోని అగ్నికుల క్షత్రియ కమ్యూనిటీ హాలులో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అగ్నికుల క్షత్రియ జాతీయ గౌరవ సలహాదారుడు లంకే యుగంధర్ మాట్లాడుతూ లక్ష్మణ స్వామి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ రాష్ట్ర మీడియా విభాగం అధికార ప్రతినిధి వడుగు నాగార్జున, నియోజకవర్గ అధ్యక్షుడు నాయుడు వెంకట కృష్ణ, కోలా బాలాజీ, నాగాంజనేయులు, కొక్కిలిగడ్డ నాంచారయ్య, కర్రి కృష్ణమూర్తి, కొల్లు నాగబాబు, మచ్చా వెంకటేశ్వరరావు, నడకుదుటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బంటుమిల్లి ఫీల్డ్ అసిస్టెంట్ల కార్యవర్గం

బంటుమిల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండల ఫీల్డ్ అసిస్టెంట్ల సర్వసభ్య సమావేశం జి. కాంతారావు అధ్యక్షతన గురువారం జరిగింది. ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తొమ్మిది మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నడకుదుటి నరేంద్ర, కార్యదర్శిగా వై భోగేశ్వరరావు, ట్రెజరర్‌గా రాజేశ్వరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీఐటీయూ నాయకులు మాజేటి శివశ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణపై అవగాహన

నాగాయలంక, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వైపరీత్యాల పట్ల అవగాహన కలిగి ఉంటే ప్రాణాలను, ఆస్తులను కాపాడుకోవచ్చునని ఎన్డీఆర్ఎఫ్ అధికారి ఏ.కిరణ్ కుమార్ ప్రజలకు సూచించారు. ఎదురుమొండి, ఈలచెట్లదిబ్బ, నాచుగుంట గ్రామాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందం ప్రకృతి విపత్తుల సమయంలో ఎలా రక్షణ పొందాలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరదలు, తుపానులు, ఉప్పెనలు వచ్చినప్పుడు ప్రజలు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు వివరించారు. మూడు గ్రామాల ప్రజలకు 2300 సింథటిక్ మ్యాట్లను అందించారు. తహసీల్దార్ వీరాంజనేయ ప్రసాద్, ఎస్సై రాజేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మోపిదేవిలో రాజుకున్న సొసైటీల చిచ్చు

• కొక్కిలిగడ్డ సొసైటీ చైర్మన్ నియామకంపై మెడబలిమి అసంతృప్తి

మోపిదేవి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సొసైటీ పాలకవర్గాల నియామకం మోపిదేవి మండల టీడీపీలో పార్టీలో చిచ్చు రేకెత్తించింది. కొక్కిలిగడ్డ సొసైటీ పాలకవర్గ నియామకం పార్టీలో అసంతృప్తి జ్వాలలు రేకెత్తించగా, గురువారం రాత్రి మోపిదేవి జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లిఖార్జునరావు ఇంటి వద్ద టీడీపీ, కూటమి నేతలు సమావేశమై ఐదు రోజుల్లో ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకోకుంటే జరిగే పరిణామాలకు తాము బాధ్యులం కాదంటూ హెచ్చరించారు. కొక్కిలిగడ్డ సొసైటీకి సంబంధించి చైర్మన్‌గా కోనేరు నాగేశ్వరరావు పేరును తొలుత జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లిఖార్జునరావు, మండల టీడీపీ అధ్యక్షుడు నడకుదిటి జనార్ధనరావు, పార్టీ సీనియర్ నేత రావి నాగేశ్వరరావు, పార్టీ ముఖ్యులు ప్రతిపాదించారు. కొద్దిరోజుల తర్వాత మెడబలిమి మల్లిఖార్జునరావు తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకుని రెండు పేర్లను ప్రతిపాదించగా, పార్టీ మాత్రం ముందుగా వచ్చిన పేరునే ఖరారు చేస్తూ బుధవారం కేడీసీసీ బ్యాంకులకు చైర్మన్, ఇద్దరు సభ్యుల పేర్లను పంపించటంతో మల్లిఖార్జునరావు తన అసంతృప్తిని పార్టీ ముఖ్యుల దృష్టికి తీసుకువెళ్లారు. సొసైటీ పాలకవర్గం విషయంలో తాను చెప్పాల్సింది పార్టీకి ఇప్పటికే చెప్పానని, తరువాత నిర్ణయం పార్టీనే తీసుకోవాలని మల్లిఖార్జునరావు మీడియా సమావేశంలో తెలిపారు. మండవ బాలవర్ధిరావు, పైడిపాముల కృష్ణకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు నడకుదిటి జనార్ధనరావు అంతకుముందు మల్లిఖార్జునరావును కలిసి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు.



బందరు మునిసిపల్ పార్కులో మహిళల జిమ్ ప్రారంభించి మాట్లాడుతున్న కమిషనర్ బాపిరాజు



చల్లపల్లి ఎన్టీఆర్ పార్కులో ఓపెన్ జిమ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మండలి

మచిలీపట్నంలోని పార్కులను తీర్చిదిద్దుతాం

• మున్సిపల్ కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : దాతల సహకారంతో మచిలీపట్నంలోని మునిసిపల్ పార్కులను సుందరంగా తీర్చిదిద్దుతామని నగర పాలక సంస్థ కమిషనర్ బాపిరాజు పేర్కొన్నారు. మచిలీపట్నంలోని మాకర్ల వెంకట స్వామి నాయుడు మునిసిపల్ ప్రధాన పార్కులో దివీస్ లేబరేటీస్ మేనేజింగ్ డైరెక్టర్ దివి మురళీకృష్ణ ప్రసాద్ విరాళంగా అందజేసిన రూ.35 లక్షల తో లేడీస్ జిమ్, అంతర్గత రోడ్లు, పిల్లల ఆట వస్తువులు సమకూర్చారు. మహిళల జిమ్ ప్రారంభోత్సవ కార్యక్రమం లో మునిసిపల్ కమిషనర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. నగర ప్రజలతో పాటు పిల్లలకు మునిసిపల్ పార్కులు ఆట విడుపుగా ఉంటాయన్నారు. దివి మురళీకృష్ణ ప్రసాద్ స్నేహితుడు దోరడ్ల హేమ ప్రకాష్, మంచాల రాంబాబు, కాళీపట్నపు ఉమ, చిట్టికుమారి, జెకె శ్రీనివాస్, రాంబాబు, డీఈ రాంప్రసాద్, ఏఈ జ్వాలా దీప్తి, పార్కు సూపర్‌వైజర్ రాంబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాళీపట్నపు ఉమ మృదు మధురంగా కీర్తనలు గానం చేశారు.

వ్యాయామంతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులు కావాలి : మండలి

చల్లపల్లి : దాతల సహకారంతో ప్రజలకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దిన చల్లపల్లి ఎన్టీఆర్ పార్కు ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ పార్కులో శ్రీమంతు క్లబ్ ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్యం కోసం పారిశ్రామికవేత్త నాయుడు శ్రీధర్ (బుజ్జి) రూ.4 లక్షలు, ప్రముఖులు నాదెళ్ల పూర్ణచంద్రరావు, వేమూరి కృష్ణారావు, మాలెంపాటి కృష్ణ, పొలడుగు రత్నకుమార్ లక్ష రూపాయల చొప్పున వితరణతో ఓపెన్ జిమ్ నిర్మించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి గురువారం ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. పార్కు అభివృద్ధి, మౌలిక సౌకర్యాల కల్పనలో దాతల పాత్ర ముదావహమన్నారు. డాక్టర్ డీఆర్కే ప్రసాద్ - డాక్టర్ పద్మావతి నేతృత్వంలో జరుగుతున్న స్వచ్ఛ చల్లపల్లి ఉద్యమం స్ఫూర్తిదాయకమన్నారు. మానసిక వికాసాన్ని అందించేందుకు శారీరక వ్యాయామం చేసుకుని ఆరోగ్యవంతులుగా నిలవాలని కోరారు. శ్రీమంతు క్లబ్ గౌరవ అధ్యక్షుడు వీరమాచినేని బవానీప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో స్వచ్ఛ చల్లపల్లి సారథులు డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి, సీఐ కె.ఈశ్వరరావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఏఎంసీ చైర్‌పర్సన్ తోట కనకదుర్గ, శ్రీమంతు క్లబ్ అధ్యక్షుడు నాదెళ్ల వెంకట నరసయ్య, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, మండల టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, తుమ్మల చౌదరిబాబు, మం డవ బాలవర్ధిరావు, దాసి సీతారామరాజు, జివి.తాతారావు, ఈవో పివి.మాధవేంద్రరావు,వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శతజయంతి సందర్భంగా మండలి వెంకట కృష్ణారావు చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు.

చంద్రబాబు పాలనలో చేనేతకు జీవం

పెడన, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : చేనేత వస్త్రాలపై జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, మగ్గాలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల దాకా ఉచితంగా విద్యుత్ అందించాలని, చేనేత కార్మికుల కోసం రూ. 5 కోట్లతో త్రిఫ్ట ఫండ్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఈ నిర్ణయాల అమలుతో చేనేత రంగం పుంజుకుంటుందని, తక్కువ ధరల్లో చేనేత వస్త్రాలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. చేనేత రంగానికి ఊతమిచ్చేలా నేతన్నలను ఆదుకునేందుకు చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలు త్వరితగతిన అమలయ్యేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రతి చేనేత కార్మికుడికి ఏటా రూ. 25 వేల ఆర్థికసాయం అందించనుందని ఆయన ప్రకటించారు. కలంకారీ కార్మికులు, కలంకారీ వస్త్ర ఉత్పత్తిదారులు మొత్తం 10వేల మందికి ఉపయోగపడే కలంకారీ క్లస్టర్ పెడనలో ఏర్పాటు కానుందని ఆయన తెలిపారు. బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు మాట్లాడుతూ, చేనేత సహకార సంఘాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయించాలని కోరారు. చేనేత కార్మికులకు చేతినిండా పని, వారి శ్రమకు తగ్గ ఫలితం ఉండాలన్నారు. పెడనలో కలంకారీ క్లస్టర్ ఏర్పాటుకు ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ విశేషమైన కృషి జరిపారని ఆయన ప్రశంసించారు. జిల్లా చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు సిహెచ్. సాయి ప్రసాద్, మునిసిపల్ కమిషనర్ ఎల్. చంద్రశేఖరరెడ్డి, తహసీల్దార్ కె. అనిల్‌కుమార్, మాజీ ఫ్లోర్ లీడర్ కట్టా మూర్తి, టీడీపీ చేనేత విభాగం నాయకుడు భట్ట శివశంకర్, వాసు తదితరులు మాట్లాడారు. సభానంతరం సీనియర్ చేనేత కార్మికులను సన్మానించారు. వీవర్స్ సర్వీస్ సెంటర్‌లో శిక్షణ పొందిన చేనేత కార్మికులకు సర్టిఫికెట్లు అందజేశారు. కాగా జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత సహకార సంఘాల ఆధ్వర్యంలో చేనేత కార్మికులు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. చేనేతను పరిరక్షించాలని, చేనేత కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని ప్రదర్శనలో పాల్గొన్న కార్మికులు నినాదాలు చేశారు. సర్వోదయ వీవర్స్ సొసైటీ నుంచి ప్రారంభమైన ప్రదర్శన బస్టాండ్ సెంటర్ వరకు కొనసాగింది. బస్టాండ్ సెంటర్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ సిహెచ్. సాయిప్రసాద్, చేనేత కార్మిక సంఘ నేత కట్టా హేమసుందరరావు, చేనేత సహకార సంఘాల అధ్యక్షులు, మేనేజర్లు పాల్గొన్నారు.



జాతీయ చేనేత దినోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



మానవత మహిళా కమిటీ కన్వీనర్ కరెడ్ల సుశీల, సభ్యులు

మహిళలను చైతన్యవంతం చేయాలి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా మహిళలను చైతన్యవంతం చేయాలని మచిలీపట్నం మానవత సేవా సంస్థ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ అన్నారు. స్టార్ స్కూల్ ప్రాంగణంలో గురువారం మానవత మహిళా కమిటీని ఏర్పాటు చేశారు. కరెడ్ల సుశీల కన్వీనర్‌గా ఉండే 12 మంది మహిళలతో కమిటీని ఏర్పాటు చేశారు. లంకిశెట్టి బాలాజీ కన్వీనర్‌గా మానవత ఓదార్పు సేవా కమిటీని ఏర్పాటు చేశారు. మచిలీపట్నం మానవత సేవా సంస్థ అధ్యక్షుడు జి.కిషోర్ కుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ విద్యా నిధి కమిటీ కన్వీనర్‌గా ఎన్నికైన పి శ్రీరామ్‌ను సంస్థ ప్రతినిధులు సత్కరించారు. శ్రీరామ్ మాట్లాడుతూ, పేద విద్యార్థులను ఆదుకోవడంతో పాటు ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో జిల్లా స్థాయిలో విద్యాకమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఓదార్పు సహకార కమిటీ ఆధ్వర్యంలో పేద, అనాథ శవాల అంత్యక్రియల్లో సేవలందిస్తారన్నారు. వివిధ కమిటీల ప్రతినిధులు పి.సుం దరరామ్, పి.వి. ఫణికుమార్, అయ్యప్పస్వామి, ఆదిత్య, మల్లికార్జునుడు, అజ్మతున్నీసా, నూర్జహన్, కె రాజేంద్రప్రసాద్, చిట్టి కుమారి పాల్గొన్నారు.

యార్లగడ్డలో సుపరిపాలనలో తొలి అడుగు

చల్లపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లగా కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జి మోర్ల శివ అన్నారు. యార్లగడ్డ 54, 55వ బూత్‌ల పరిధిలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. టీడీపీ నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరు అడిగి తెలుసుకున్నారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు తొట్టెంపూడి శివపాండురంగారావు, మాజీ సర్పంచ్ బొబ్బా కృష్ణారావు, నీటి సంఘం అధ్యక్షుడు తొట్టెంపూడి రాధాకృష్ణ, నేతలు, పెద్దిబోయిన హరినాద్, శంకర రామ కోటేశ్వరరావు, నండూరి శ్రీనివాసరావు, పాండురంగారావు, రంగారావు, గోపి, కోటేశ్వరరావు, సుబ్బారావు, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వేకనూరులో కొల్లూరి ఆధ్వర్యంలో

అవనిగడ్డ రూరల్ : సుపరిపాలన కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమైందని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. వేకనూరులో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్ తుంగల శ్రీలక్ష్మీ, టీడీపీ నేతలు ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. పరుచూరి దుర్గా ప్రసాద్, బండే రాఘవ, మండలి రామ్మోహనరావు, అడపా శ్రీను, మాదివాడ నారాయణ, తుంగల సత్యనారాయణ, కైతేపల్లి రామాంజనేయులు, తుంగల రాజేష్; కైతేపల్లి సాయిబాబు, నిజాంపట్నం మురళీ, కైతేపల్లి పున్నయ్య, జటావత్తు శ్రీను, కమ్మిలి సుబ్రహ్మణ్యం, బచ్చు అబ్బాయి, అడపా సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



పత్రాలు లేకుంటే చర్యలు : ఎస్సై

కోడూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : పత్రాలు లేని వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై చాణిక్య అన్నారు. కోడూరు - అవనిగడ్డ ప్రధాన రహదారిపై గురువారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆటో, ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు లైసెన్స్ కలిగి ఉండాలని, నిబంధనలను పాటించాలని అన్నారు. మద్యం తాగి డ్రైవింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రైనీ ఎస్సై సిహెచ్. దివ్య ప్రకాష్ పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

పెడన రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతకు అందరూ కృషి చేయాలని డీఎల్‌పీవో రజావుల్లా పిలుపునిచ్చారు. బల్లిపర్రులో డిప్యూటీ ఎంపీడీవో నాగిరెడ్డితో కలసి గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. వర్షాకాలంలో నీరు నిల్వలు లేకుండా చూడాలని ప్రజలకు సూచించారు. కార్యదర్శి నాగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవీకే విగ్రహానికి నివాళి

నాగాయలంక, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జయంతి పురస్కరించుకుని నాగాయలంకలోని మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి గురువారం కూటమి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, ఉప్పల ప్రసాద్, బండ్రెడ్డి హరి, మల్లిఖార్జునరావు, మండలి ఉదయభాస్కర్, గుడివాక శివరావు, రేమాల బాబురావు, అవనిగడ్డ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

పెడన రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : చిన్న తరహా పరిశ్రమలకు గుర్తింపు రావాలంటే జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా రిజిస్ట్రేషన్ తప్పనిసరని జిల్లా పరిశ్రమల శాఖ జీఎం.ఆర్ వెంకట్రామయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కటకం శివప్రసాద్‌తో కలిసి చిరు వ్యాపారులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఇంటి వద్దనే చిన్నపాటి పరిశ్రమలు నిర్వహించుకునే వారికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు, ఆర్థిక సాయం అందాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరన్నారు. పరిశ్రమల శాఖ ఏడీ పి ప్రతాప్, పరిశ్రమల అభివృద్ధి అధికారి బి మనోజ్, ఏపీఎం శ్రీదేవి పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

ఘంటసాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఘంటసాల సర్పంచ్ బాణావత్ వెంకటేశ్వరమ్మ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఘంటసాలలోని అంగన్వాడీ కేంద్రంలోతల్లులకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.రమా నాగమణి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కృష్ణవేణి, మహిళా పోలీసు రాజ్యలక్ష్మి, నాగ దీప్తి, ఏఎన్ఎంలు జయలక్ష్మి, రాణి, ఎంఎల్‌హెచ్‌వి అనూష, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. గ్రామంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

తల్లిపాల వారోత్సవ ర్యాలీ

అవనిగడ్డ రూరల్ : అవనిగడ్డ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో వారం రోజులపాటు నిర్వహించిన తల్లిపాల వారోత్సవా లు గురువారంతో ముగియటంతో సీడీపీవో శేషుకుమారి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలు బిడ్డకు అమృతం అని, తల్లిపాల ద్వారానే బిడ్డకు శక్తి, ఆరోగ్యం పెరుగుతుందని తెలిపారు. సూపర్‌వైజర్ రత్నమాల, ప్రాజెక్టు కార్యదర్శి ఏ.నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రుద్రవరం గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

మచిలీపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం మండలం రుద్రవరం గురుకుల జూనియర్ కళాశాలలో 5, 6, 7, 10 తరగతులలో, జూనియర్ ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీ గ్రూపులలో సీట్లు ఖాళీగా ఉన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా తరగతుల్లో మిగులు సీట్లను స్పాట్ అడ్మిషన్ ద్వారా భర్తీ చేస్తామని, వివిధ తరగతుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు నేరుగా కళాశాలలో లేదా సెల్ నెంబరు 97045 50058లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుల్ పదోన్నతి

మచిలీపట్నం క్రైమ్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు ఏ.ఆర్ కానిస్టేబుళ్లు కె.నాగరాజు, జె.ఎస్.ఆర్ ప్రసాద్‌లకు హెడ్ కానిస్టేబుల్ పదోన్నతి కల్పిస్తూ ఎస్పీ ఆర్.గంగాధరరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ కార్యాలయంలో వారికి పదోన్నతి పత్రాలను అందజేశారు.